




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 50, పేజీలు - 08

గురువారం, జులై 24, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# బీసీ రిజర్వేషన్లపై బీజేపీ మాట మారుస్తోంది

- అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించినట్లు వెల్లడి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రిజర్వేషన్లను తీసేశాకే తెలంగాణలో మాట్లాడాలని డిమాండ్
- తమ రిజర్వేషన్లలో మత ప్రస్తావన లేదన్న రేవంత్ రెడ్డి - బీజేపీ అప్పుడు మద్దతు తెలిపి, ఇప్పుడు మరోలా మాట్లాడుతున్నారు
- బీజేపీ తీరును ఢిల్లీలో తప్పుబట్టిన సీఎం రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన బిల్లు విషయంలో భారతీయ జనతా పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిచినట్లు చెప్పిన సీఎం కేంద్రంలోని విపక్ష కూటమి నేతలను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ నేతలు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి ఇప్పుడు మాట మారుస్తున్నారని ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ముస్లింల శాతాన్ని ఇందులో నుంచి తీసేయాలని అంటున్నారని రేవంత్ రెడ్డి చెప్పారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లకు ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఉంటుందా? అని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లు ఎందుకు తొలగించడం లేదంటూ ఆయన ప్రశ్నించారు. స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే తాము ముందుకు వెళ్తున్నామని రేవంత్ రెడ్డి ఢిల్లీల్లో స్పష్టం చేశారు. కులగణన సర్వేలో 3.99 శాతం మంది తమకు ఏ కులం లేదని చెప్పారన్నారు. కులగణన సర్వే డేటా కావాలంటే అసెంబ్లీలో ఆయా పార్టీల ముందు ప్రవేశపెడతామన్నారు. రిజర్వేషన్లలో మత ప్రస్తావనే లేదని, ముస్లింల పేరుతో మరోసారి రాజకీయాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. కేంద్రం బిల్లులకు త్వరగా ఆమోదం తెలిపితే సెప్టెంబర్ లోపు తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 30లోపు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోసం మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్నాయని, ఇదే సరైన సమయం అని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# ఓట్లు చోరీ చేసి గెలుస్తున్నారు

- త్వరలో అన్నీ బయటపెడతా



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. కర్ణాటకలో ఎన్నికల సమయంలోనూ ఓట్ల చోరీ జరిగిందని త్వరలోనే ఆ వివరాలను బ్లాక్ అండ్ వైట్ విధానంలో ప్రజల ముందు ఎన్నికల కమిషన్ ముందు ఉంచుతామని అన్నారు. ఎన్నికలు చోరీ చేసి ఎన్డీఏ కూటమి గెలిచేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. బీహార్ ఓటర్ల జాబితా నుంచి ఏకంగా 52 లక్షలకు పైగా పేర్లు తొలగించినట్లు ఎన్నికల సంఘం తాజాగా తెలిపింది. బిహార్లో మొత్తం 18 లక్షల మంది ఓటర్లు మరణించారు. 26 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు మారినట్లు ఎలక్షన్ కమిషన్వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇది కేవలం 52 మందికే కాదు. బిహార్ లో మాత్రమే ఇలా జరగడం లేదు. మహారాష్ట్రలోనూ ఇలాగే చీట్ చేసి గెలిచారు. ఓటర్ల లిస్టు బహిర్గతం చేయమని ఎలక్షన్ కమిషన్ కు విన్నవించాం. కానీ కమిషన్ పట్టించుకోలేదు. వీడియోగ్రఫీ అడిగాం. వాళ్లు చట్టాన్నే మార్చేశారు. కోటి మంది కొత్తగా మహారాష్ట్రలో ఓటర్ గా అర్హత పొందారు. అయితే ఆ రాష్ట్రంలో ఎలక్షన్ ను చోరీ చేశారు" అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. కర్ణాటక ఎన్నికల సమయంలోనూ

2లో..

# రాజాసింగ్ రిటర్న్

- రాజాసింగ్ పై బీజేపీ నిర్ణయం మారిందా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాపై పార్టీ నాయకత్వం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. ఇందుకు కారణం రాజాసింగ్ కూడా కూడా వెనక్కుతగ్గడమే కారణమని సమాచారం. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో పార్టీ కేంద్ర నాయకత్వం ఈ నెల 11వ తేదీన రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తర్వాత రాజాసింగ్ మాత్రం తాను ఏ పార్టీలో చేరనని, తాను మోదీ, అమిత్ షాలకు వీర విధేయుడినని ప్రకటించుకున్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమన్నా తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా

2లో..

# చైనా పౌరులకు మళ్లీ పర్యాటక వీసాలు జారీ

- భారత్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** గాల్వన్ వద్ద 2020లో జరిగిన సరిహద్దు ఘర్షణల తర్వాత చైనా పౌరులకు పర్యాటక వీసాలను భారత్ నిలిపివేయడం తెలిసిందే. అయితే, గత కొంతకాలంగా చైనా వైఖరిలో మార్పు వచ్చింది. భారత్–చైనా మధ్య పలు చర్చలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

2లో..

# రూ.20,216 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

- విశాఖకు పలు దిగ్గజ సంస్థల పెట్టుబడులు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రివర్గ ఉప సంఘం ఛైర్మన్‌గా ఉన్న నారా లోకేష్, మంత్రివర్గ సహచరులతో కలిసి పెట్టుబడుల కోసం చేస్తున్న ప్రయత్నాలు కార్యరూపం దాల్చుతున్నాయి. ఈ క్రమంలో ప్రతిష్టాత్మత సంస్థలను రాష్ట్రానికి రప్పించడంలో మరో అడుగు ముందుకు పడింది. రాష్ట్రానికి కొత్తగా మరో 4 కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ప్రతిష్టాత్మక సంస్థలైన సిఫి, సత్వా, బివిఎం, ఎఎన్ఎస్ఆర్ సంస్థలు రూ.20,216



కోట్ల పెట్టుబడులకు ముందుకు రాగా ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో బుధవారం జరిగిన 9వ ఎస్ఐపిబి సమావేశం ఆమోదం తెలిపింది.

**- 56000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**

ఈ పెట్టుబడుల ద్వారా 50,600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ సందర్భంగా 20 లక్షల ఉద్యోగాల కల్పన సబ్ కమిటీకి ఛైర్మన్‌గా ఉన్న నారా లోకేష్ సమావేశంలో

2లో..

# ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఈసీ కసరత్తు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) జగదీప్ ధన్‌కడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవి కోసం త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఈ కసరత్తు పూర్తవగానే ఎన్నికల షెడ్యూల్‌ను వెల్లడించనుంది. ఇప్పటికే ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం

2లో..

# చంద్రబాబుతో 5 నిమిషాలు మాట్లాడి పెట్టుబడులతో వచ్చాం

- ఇన్వెస్టోపియా సదస్సులో దుబాయ్ ఆర్థిక మంత్రి

**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఇన్వెస్టోపియా గ్లోబల్-ఏపీ సదస్సు 2025 జులై 23న విజయవాడలోని నోవోటెల్ హోటల్‌లో జరిగింది. ఈ ఈవెంట్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌఖ్ అల్ మర్రీతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, వ్యాపార నాయకులు పాల్గొన్నారు. దావోస్‌లో చంద్రబాబు




నాయుడుతో 5 నిమిషాల సమావేశం తర్వాత ఆయన విజన్‌కు ఆకర్షితులై, 6 నెలల్లోనే ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైనట్లు యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌఖ్ అల్ మర్రీ ప్రకటించారు.

2లో..

# దత్తాత్రేయకు ఉప రాష్ట్రపతి పదవి ఇవ్వాలి

- ఉప రాష్ట్రపతి పదవికి బండారు దత్తాత్రేయను ప్రకటించాలి
- ఇండియా కూటమితో మద్దతు ఇప్పించే బాధ్యత నాది
- ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయకు ఉప రాష్ట్రపతి పదవి ఇవ్వాలంటూ సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. జగదీప్ ధన్‌ఖడ్ ఇటీవల తన ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. దాంతో ఆ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీలో మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి పదవిని దత్తాత్రేయకు ఇవ్వాలంటూ కోరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దత్తాత్రేయకు ఉప రాష్ట్రపతి పదవి ఇస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీలతో పాటు తెలుగు వారికి కూడా సరైన గౌరవం దక్కుతుందని ఆయన అభిప్రాయం

2లో..

# ఫోన్ ట్యాపింగ్ కేసులో వేధిస్తున్నారు

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన ప్రభాకర్ రావు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణకు పిలిచి సిట్ అధికారులు తనను వేధిస్తున్నారంటూ పిటిషన్ దాఖలు చేశారు. ఆగస్టు 4న ప్రభాకర్ రావు పిటిషన్ విచారణకు రానున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ప్రభాకర్ రావును అరెస్ట్ చేయకుండా కల్పించిన వెసులుబాటును కొట్టేయ్యాలంటూ సిట్ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే సిట్ అధికారులు

2లో..

# బొగత జలపాతం తాత్కాలిక మూసివేత

-కుండపోత వర్షాల కారణంగా పరవళ్లు తొక్కుతున్న జలపాతం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి భారీ వర్షాలు కురుస్తోన్నాయి. ప్రత్యేకించి– తెలంగాణపై దీని తీవ్రత అధికంగా ఉంటోంది. హైదరాబాద్‌ను ఇప్పటికే అతి భారీ వర్షం ముంచెత్తింది. మరో రెండు రోజుల పాటు ఇవే పరిస్థితులు కొనసాగే



2లో..

# తప్పిన పెను ఉగ్రప్రమాదం

- గుజరాత్‌లో నలుగురు అల్ ఖైదా టెర్రరిస్టుల అరెస్ట్

**గాంధీ నగర్ (ప్రశ్న న్యూస్)** గుజరాత్‌లో భారీ ఉగ్రకుట్రను భద్రత బలగాలు భగ్నం చేశాయి, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ అల్?–ఖైదాకు అనుబంధంగా పనిచేస్తున్న నలుగురు తీవ్రవాదులను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) బుధవారం అరెస్టు చేసింది. వారిలో ఒకడు వేరే రాష్ట్రం నుంచి వచ్చి పట్టుబడినట్లు అధికారులు తెలిపారు.



2లో..

# యూపీలో అక్రమాలు.. హైదరాబాద్‌లో సోదాలు

- ఈడీ రెయిడ్స్ కలకలం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీ ఆఫీసుల్లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. ఎస్ఈడబ్ల్యూ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ కంపెనీ కు చెందిన డైరెక్టర్ల నివాసాలపై ఈడీ సోదాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. బ్యాంకు లోన్ వ్యవహారంలో గతంలో సంస్థపై సిబిఐ కేస్ నమోదు అయింది. ఉత్తరప్రదేశ్ లో ప్రాజెక్టు నిర్మాణానికి 14 బ్యాంకుల నుండి 1700 కోట్ల రూపాయల రుణాలు తీసుకున్న కంపనీ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే సబ్ కాంట్రాక్టుల పేరుతో నిధులను మళ్లించినట్లుగా గుర్తించారు. 621 కోట్ల రూపాయలు బ్యాంకులకు ఎగ్గొట్టినట్లుగా ఫిర్యాదులు ఉన్నాయి. హైదరాబాదులో మొత్తం ఆరు చోట్ల ఈ డి సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకుంది. 120 కోట్ల విలువచేసే పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఎస్ఈడబ్ల్యూ కు ప్రమోటర్లుగా ఉన్న వారితోపాటు కుటుంబ సభ్యుల నివాసాల్లోనూ సోదాలు చేసి సంస్థకు చెందిన 33 బ్యాంక్ అకౌంట్ లను ఫ్రీజ్ చేసినట్లుగా చెబుతున్నారు. ఎస్ఈడబ్ల్యూ ఎల్ఎస్వై హైవేస్ లిమిటెడ్, డైరెక్టర్లు సుంకర అనిల్ కుమార్, యర్లగడ్డ వెంకటేశ్వర రావు,




2లో..

# ఓట్లు చోరీ చేసి గెలుస్తున్నారు

భారీగా ఓట్ల చోరీ చేశారు. ఆ విషయాలపై ఎలక్షన్ కమిషన్ తోపాటు ప్రజల ముందు ఉంచుతా. బ్లాక్ అండ్ వైట్ విధానంలో మేము ఈ చోరీని కర్ణాటకలో గుర్తించాం.. అని రాహుల్ గాంధీ తెలిపారు.ఇప్పుడు వాళ్ల గేమ్ తమకు అర్థమైందని వాళ్లకు తెలుసు. మేము ఒక నియోజకవర్గాన్ని తీసుకుని లోతుగా విశ్లేషించాం. సమస్య ఏంటంటే వాళ్లు ఓటర్ లిస్టు ఇస్తారు. ఆ ఓటరు లిస్టును పూర్తిగా విశ్లేషించలేము. మేము ఆ లిస్టును డిజిటల్ ఫార్మాట్ లో పెట్టాము. ఆ తర్వాత మా పరిశోధనలో నిజాలు బయటకు వచ్చాయి. ఆ ఓటర్లు ఎవరు, ఎక్కడి నుంచి తీసుకొచ్చారని గుర్తించాం. అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఎలక్షన్ కమిషన్ ఈ విషయాన్ని గ్రహించి ఓటర్లను డిలీట్ చేయడం అనే కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. భారత్ లో ఓట్లు చోరీ అవుతున్నాయి. ఇదే రియాల్టీ అని రాహుల్ గాంధీ కీలక విమర్శలు చేశారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాతో పోస్టు చేశారు. మహారాష్ట్రలో ఎలా మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందో మేము వివరించాం. కర్ణాటకలోనూ ఇదే చేశారు. కర్ణాటకలో ఓ నియోజకవర్గం తీసుకుని పూర్తిగా విశ్లేషించాం. అప్పుడు అసలు విషయం బయటపడింది. మేము చూస్తూ కూర్చోం. ప్రజల ముందుకు తీసుకొస్తాం. అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బిహార్ రాష్ట్రం ఎన్నికలకు సిద్ధం అవుతోంది. ఈ మేరకు బీహార్ ఓటర్ల జాబితా నుంచి ఏకంగా 52 లక్షలకు పైగా పేర్లు తొలగించినట్లు ఎన్నికల సంఘం తాజాగా తెలిపింది. బిహార్లో మొత్తం 18 లక్షల మంది ఓటర్లు మరణించారు. 26 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు మారినట్లు ఎలక్షన్ కమిషన్తెలిపింది. మరో 7 లక్షల మంది ఓటర్లు రెండు చోట్ల ఓటు నమోదు చేసుకున్నట్లు ఈసీ అధికారుల దృష్టికి వచ్చింది. ఈ మేరకు తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 30, 2025న ప్రచురించనున్నట్లు తెలిపింది. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ఆగస్టు 1న ప్రచురించనుంది.

# రాజాసింగ్ రిటర్న్

ఉన్నానని రాజాసింగ్ తెలిపారు. అదే సమయంలో గోషామహల్ బీజేపీకి అడ్డా అని, ఇక్కడ ఎవరు పోటీ చేసినా విజయం ఖాయమని ఆయన అన్నారు.

**- విరమించుకుందా.?**

మరొవైపు రాజాసింగ్ రాజీనామాను ఆమోదించిన నాయకత్వం ఆయన ఎమ్మెల్యే పదవి విషయంలో మాత్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. సహజంగా పార్టీకి రాజీనామా ఆమోదించిన తర్వాత పార్టీ నాయకత్వం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కు ఈ విషయాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. పార్టీ బీఫారం పై పోటీ చేసి గెలుపొందిన రాజాసింగ్ ను స్పీకర్ ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేసే అవకాశముంటుంది. కానీ బీజేపీ నాయకత్వం మాత్రం రాజీనామాను ఆమోదించి దాదాపు పన్నెండు రోజులవుతున్నా స్పీకర్ కు లేఖ రాయకపోవడంతో తిరిగి రాజీనామాపై ఆలోచన చేస్తుందని చెబుతున్నారు. రాజాసింగ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు పక్కా హిందుత్వ వాదిగా ముద్రపడటంతో ఆయనను బయటకు పంపించే ప్రయత్నాన్ని విరమించకుందని చెబుతున్నారు.

**- తగ్గినట్లుగానే..**

దీనికి తోడు రాజాసింగ్ కూడా బీజేపీ తన రాజీనామా ఆమోదించిన తర్వాత చాలా తగ్గినట్లు కనిపిస్తుంది. రాజీనామా ఆమోదించిన తర్వాత ఎలాంటి పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేయకపోవడంతో పాటు తాను మోదీ, షాలకు విధేయుడినని ప్రకటించుకోవడం కూడా మళ్లీ బీజేపీలో కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు అర్థమవుతుంది. దీనికి తోడు తాజాగా నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ చేసిన కామెంట్స్ కూడా ఇందుకు ఊతమిస్తున్నాయి.రాజా భాయ్ ఎక్కడున్నా గౌరవిస్తామని అరవింద్ అన్నారు. ఆయన సస్పెండ్ కాలేదు పార్టీకి రాజీనామా మాత్రమే చేశారన్న అరవింద్, పార్టీ సభ్యత్వం కోసం మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వం తీసుకోవచ్చని కూడా తెలిపారు. కొన్ని విషయాల్లో మనస్తాపం చెంది రాజా భాయ్ రాజీనామా చేశారని ధర్మపురి అరవింద్ అనడం కూడా రాజాభాయ్ రిటర్న్ అవుతారన్న టాక్ వినిపిస్తుంది.

# చైనా పౌరులకు మళ్లీ పర్యాటక వీసాలు జారీ

ఈ నేపథ్యంలో, కీలక పరిణామం చోటుచేసుకుంది. చైనా పర్యాటకులకు తిరిగి వీసాలు మంజూరు చేయాలని భారత్ నిర్ణయించింది. ఈ నిర్ణయం జూలై 24 నుంచి అమలులోకి వస్తుందని చైనాలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. సరిహద్దు వివాదాలు, వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా దెబ్బతిన్న సంబంధాలను మెరుగుపరచడం దీని లక్ష్యం.
గాల్వాన్ ఘర్షణల తర్వాత భారత్ చైనా పెట్టుబడులు, యాప్‌లపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఏర్పడిన దౌత్యపరమైన స్తంభన తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. 2022లో భారతీయ విద్యార్థులకు, వ్యాపార యాత్రికులకు చైనా వీసాలను తిరిగి ప్రారంభించినప్పటికీ, భారత్ మాత్రం చైనా పౌరులకు పర్యాటక వీసాల జారీని ఇప్పటివరకు నిలిపి ఉంచింది. తాజాగా, భారత్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని చైనా స్వాగతించింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మాట్లాడుతూ, నిరంతర చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశాలతో దౌత్యపరమైన వాతావరణం మెరుగుపడుతున్న సంకేతాలు ఉన్నప్పటికీ 3,800 కిలోమీటర్ల వివాదాస్పద సరిహద్దు సమస్య ఇంకా పరిష్కారం కాలేదు. ఇరుదేశాల సంబంధాలు పూర్తిస్థాయిలో సాధారణ స్థితికి రావాలంటే సైనిక ప్రతిష్టంభనను పరిష్కరించడం, వాణిజ్య ఆంక్షలను ఎత్తివేయడం అవసరమని భారత విదేశాంగ మంత్రి నొక్కి చెప్పారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికలకు
# ఈసీ కసరత్తు

ఎలక్టోరల్ కాలేజీని సిద్ధం చేయడంలో, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించడంలో ఎన్నికల సంఘం బిజీ అయిపోయింది. ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి పదవి ఖాళీకాగానే రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహిస్తుంది. ఆ మేరకు ఉపరాష్ట్రపతి ఎన్నికల కోసం ఈసీ కసరత్తు చేస్తోంది. అనారోగ్య కారణాలతో తాను ఉపరాష్ట్రపతి పదవి నుంచి తప్పుకుంటున్నానని పేర్కొంటూ జగదీప్ ధన్‌కడ్ సోమవారం రాత్రి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తన రాజీనామా పంపారు. రాష్ట్రపతి నిన్న ఆయన రాజీనామాకు ఆమోదం తెలిపారు. అనంతరం కేంద్ర హోంశాఖకు పంపారు. కేంద్ర హోంశాఖ ఉపరాష్ట్రపతి రాజీనామాను ఆమోదించిన విషయాన్ని పార్లమెంట్ ఉభయసభలకు సభాధ్యక్షుల ద్వారా తెలియజేసింది.?

# దత్తాత్రేయకు ఉప రాష్ట్రపతి పదవి ఇవ్వాలి

వ్యక్తం చేశారు. ఇండియా కూటమి తరపున తాను మాట్లాడటం లేదని, తెలంగాణ ప్రజల తరపున మాట్లాడుతున్నానని చెప్పారు. ఎన్డీఏ కూటమి దత్తాత్రేయను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటిస్తే, ఆయనకు మద్దతు ఇచ్చేలా తాను ఇండియా కూటమితో మాట్లాడుతానంటూ రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.తెలంగాణలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేగా బండారు దత్తాత్రేయ పనిచేశారు. హర్యానా గవర్నర్‌గా పనిచేసిన దత్తాత్రేయకు ఇటీవలే పదవీ కాలం ముగిసింది. అయితే ఉప రాష్ట్రపతి పదవికి ఇప్పుడు దత్తాత్రేయను సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేయడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. బిహార్ సీఎం నితీష్ కుమార్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నాయక్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఎల్జీ సక్సేనా, జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా లాంటి వారు ఉప రాష్ట్రపతి రేసులో ఉండగా బీజేపీ దత్తాత్రేయ పేరును పరిశీలిస్తుందా అనేది ప్రశ్నార్థకమే.? ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీపై విమర్శలు గుప్పించారు. నెల రోజుల్లో కులగణన పూర్తి చేశామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి రెండు బిల్లులను కేంద్రానికి పంపిచామని, ఆ బిల్లుల ఆమోదంలో కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేస్తోందన్నారు. బీజేపీ అసెంబ్లీలో ఒకలా, పార్లమెంట్‌లో మరోలా మాట మారుస్తుందన్నారు. కేంద్రం బిల్లులకు ఆమోదం తెలిపితే సెప్టెంబర్ లోపు తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు.

# బంజారా హిల్స్ లో ఆలయం ధ్వంసం
## పాత పెద్దమ్మ గుడి ప్రాంతంలో ఉద్రిక్తత

**హైదరాబాద్** బంజారా హిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని పాత పెద్దమ్మతల్లి ఆలయం ధ్వంసం చేశారని ఆరోపిస్తూ స్థానికులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. గతంలో గుట్టలపై ఉన్న అమ్మవారి విగ్రహాన్ని ఇటీవలే తొలగించిన గుట్టల ప్రదేశంలోనే నూతనంగా నిర్మించిన భవన్లోకి మార్చారు. ఈ ఏడాది బోనాల కూడా ఘనంగా నిర్వహించినట్లు భక్తులు చెబుతున్నారు. కాగా మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దీని కూల్చివేసినట్లు వారు పేర్కొంటున్నారు. దీంతో ఆ ప్రాంతంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులను శాంతింప చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించడంతో శాంతించారు.

# రూ.20,216 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

ఆయా పెట్టుబడులు గురించి వివరించారు. ప్రతిష్టాత్మక సంస్థల రాకతో విశాఖ ఖ్యాతి మరింతగా పెరుగుతుందని ఆయన అన్నారు. ఈ పెట్టుబడులపై ఆయా సంస్థలతో జరిపిన చర్చలు, వాటి స్థితిగతులు, బలాబలాలు వెల్లడించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ భవిష్యత్ పెట్టుబడులకు, అవసరాలకు తగ్గట్లుగా విశాఖ మాస్టర్ ప్లాన్ ఉండాలని అన్నారు. విశాఖలో భూమి లభ్యత తక్కువగా ఉందని, ఇప్పటికే అర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ సహా అనేక సంస్థలకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఈక్రమంలో విశాఖకు వచ్చే సంస్థలకు అనువైన భూమిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. మౌలిక వసతుల సమస్యలు రాకుండా ప్రణాళికలు అమలు చేయాలని సిఎం ఆదేశించారు. పూణె, బెంగుళూరు వంటి పట్టణాల్లో ట్రాఫిక్, మౌలిక సదుపాయాల సమస్యలను ఈ సందర్భంగా అధికారులు ప్రస్తావించగా అటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. విమానాశ్రయం-రైలు కనెక్టవిటీ, హైవే రోడ్లు, మెట్రో వంటి వాటిపై ముందస్తు ప్రణాళికలతో అధికారులు పనిచేయాలన్నారు. పూణె, బెంగుళూరు వంటి చోట్ల నేడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మన దగ్గర తలెత్తకుండా చూడాలన్నారు.

**- వివిధ కంపెనీల పెట్టుబడుల వివరాలు**

- సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ విశాఖపట్నంలో మొదటిదశలో రూ.1,466 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 200 మందికి ఉపాధి లభించనుంది. రెండవదశలో రూ.15,000 కోట్ల పెట్టుబడులు, 400 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి.
- సత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం-మధురవాడలో రూ.1,500 కోట్ల పెట్టుబడులు పెడుతుండగా, 25,000 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.
- బీవీఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం-ఎండాడలో రూ.1,250 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 15,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి.
- ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం-మధురవాడలో రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. తద్వారా 10,000 ఉద్యోగావకాశాలు వస్తాయి.

సిఫీ టెక్నాలజీస్ ప్రముఖ ఐటీ కంపెనీలలో ఒకటి. సిఫీ టెక్నాలజీస్ లిమిటెడ్ రూ.3,621 కోట్ల టర్నోవర్, సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ రూ.1,114 కోట్ల టర్నోవర్ కలిగివుంది. రెండు ప్రాజెక్టులుగా వివిధ దశల్లో ఏపీలో తమ సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో కార్యకలాపాలు ప్రారంభిస్తుంది. సత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రెసిడెన్షియల్, కమర్షియల్ ఐటీ, ఐటీఈఎస్ పార్కులకు సంబంధించిన ప్రాజెక్టులను అభివృద్ధి చేయడంలో అనుభవం ఉంది. ప్రస్తుతం 8 నగరాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న సత్వా, 80 మిలియన్ చదరపు అడుగుల మేర కార్యాలయ సముదాయాలను నిర్మిస్తోంది. కపిల్ గ్రూపునకు చెందిన బీవీఎం ఎనర్జీ, రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విశాఖలో మినీ స్మార్ట్ టెక్ సిటీ ఏర్పాటు చేయనుంది. ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డిజైనింగ్, ఎస్టాబ్లిషింగ్, జీసీసీ ఆపరేటింగ్‌లో మార్కెట్ లీడర్‌గా ఉంది. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకూ జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల్లో 113 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో పారిశ్రామిక రంగానికి చెందిన 46 ప్రాజెక్టులు, ఇంధన రంగానికి చెందిన 41 ప్రాజెక్టులు, పర్యాటక రంగలో 11, ఐటీలో 11, ఫుడ్ ప్రాసెసింగ్ 4 పరిశ్రమలకు చెందిన పెట్టుబడులు ఎస్ఐపీబీ ఆమోదం పొందాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా రూ.5,94,454 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తున్నాయి. అలాగే 5,56,568 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి.

# చంద్రబాబుతో 5 నిమిషాలు
# మాట్లాడి పెట్టుబడులతో వచ్చాం

ఈ సదస్సు యూఏఈ-భారత ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించడానికి ఒక వేదికగా భావిస్తున్నారు.

**- దుబాయ్ ఆర్థిక వ్యవస్థలా ఏపీ ఎదిగేలా ప్రణాళికలు**

ఇన్వెస్ట్ ఇండియా, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీలో ఉన్న పెట్టుబడుల అవకాశాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ను భారతదేశంలో అగ్రగామి సాంకేతిక కేంద్రంగా మార్చాలనే తమ లక్ష్యాన్ని వెల్లడించారు. డ్రోన్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ వంటి ఉభయతారక రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని వివరించారు. దుబాయ్‌ను ఎడారి నుంచి స్వర్గంగా మార్చిన దేశంగా చంద్రబాబు ప్రశంసించారు. దుబాయ్ అభివృద్ధిని చూస్తే తనకు అసూయ కలుగుతుందని, ఆంధ్రప్రదేశ్‌ను కూడా అలాంటి ఆర్థిక కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు, రాష్ట్రంలో 974 కి.మీ. తీరప్రాంతం, బలమైన డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి ఉన్నాయని, వ్యవసాయం, హార్టికల్చర్, ఆక్వాకల్చర్, కమర్షియల్ క్రాప్స్‌లో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. 2030 నాటికి భారతదేశం 500 గిగావాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ 160 గిగావాట్లు సహకరిస్తుందని, అమరావతిలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, భారతదేశంలో మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేస్తున్న అంశాలను వివరించారు.

**- ఏఐతో భవిష్యత్ లో మరింత ప్రగతి**

క్వాంటమ్ టెక్నాలజీ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అమరావతి భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోతామనే భయం అవసరం లేదని, ప్రభుత్వ సేవలను మెరుగుపరచడానికి ఏఐని వినియోగిస్తామని తెలిపారు. "మన మిత్ర" ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నామని, క్వాంటమ్ అమరావతికి గేమ్ ఛేంజర్‌గా ఉంటుందన్నారు. ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్‌లోని పెట్టుబడి అవకాశాలను చూపించడం, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రెన్యూవబుల్ ఎనర్జీ, సెమీకండక్టర్, ఐటీ, హార్టికల్చర్ వంటి రంగాలలో సహకారాన్ని పెంచడం లక్ష్యంగా ఏర్పాటు చేసారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో వేధిస్తున్నారు

600 మందికి పైగా ఈ కేసులో విచారణ నిర్వహించారు. ఇప్పటికి కూడా చాలా మందికి నోటీసులు పంపిస్తున్నారు. తాజాగా మాజీ ఐపీఎస్ ఆర్. ప్రవీణ్ కుమార్‌కు కూడా సిట్ నోటీసులు అందజేసింది. అయితే ఇప్పటి వరకు ఆయన వాటికి స్పందించలేదు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్ రావుపై కేసు నమోదు కాగానే ఆయన విదేశాలకు పారిపోయారు. అయితే పోలీసుల నుంచి ఒత్తిడితో పాటు అరెస్టు చేయకూడదు అంటూ సుప్రీం కోర్టు రక్షణ కల్పించడంతో ఆయన తిరిగి హైదరాబాద్ వచ్చారు. ఇప్పటికే సిట్ అధికారులు ప్రభాకర్ రావును పలుమార్లు విచారించినా మళ్లీ మళ్లీ రమ్మని చెప్పడంతో సుప్రీంకోర్టులో మరో పిటిషన్ వేశాడు. ఈ కేసులో ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించడం లేదంటూ సిట్ అధికారులు చెబుతున్నారు. ఇదే కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌కు కూడా సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. జూలై 24న విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని సిట్ కోరగా ఆ నోటీసులపై బండి జూలై 23న స్పందించారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో జూలై 28న విచారణకు హాజరవుతానని తెలిపారు. ఈ కేసులో దూకుడు పెంచిన సిట్ ఒకవైపు నిందితులను విచారిస్తూనే మరోవైపు బాధితుల వాయిస్ రికార్డు చేస్తోంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు, ప్రముఖులను పిలిచి సిట్ విచారణ చేసింది.

# బొగత జలపాతం తాత్కాలిక మూసివేత

అవకాశాలు ఉన్నాయి. పశ్చిమ- మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయవ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది పశ్చిమ దిశగా కదులుతూ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ దక్షిణ ప్రాంతాల మీదుగా విస్తరించింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలో సహా వివిధ జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ ఉపరితల ఆవర్తన ప్రభావం వల్ల అటు తెలంగాణలో అతి భారీ వర్షాలు పడుతున్నాయి. మరో 48 గంటల పాటు అంటే 25వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని తెలిపింది. ములుగు, ఖమ్మం, నల్లగొండ, జయశంకర్-భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం పడే అవకాశం ఉంది. పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, వనపర్తి, కొమురంభీం ఆసిఫాబాద్, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, జనగామ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలో మోస్తరు వర్షాలు పడొచ్చు. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఎడతెరపి లేకుండా కురుస్తోన్న వర్షాలతో తెలంగాణ అతలాకుతలమైంది. రాష్ట్రవ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జలాశయాలన్నీ నిండుతున్నాయి. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాల ప్రభావం వల్ల బొగత జలపాతం ఉరకలు వేస్తోంది. తెలంగాణ నయాగరాగా గుర్తింపు ఉన్న బొగత జలపాతం వరద నీటితో పోటెత్తుతోంది. ములుగు జిల్లాలో ఉందీ వాటర్ ఫాల్స్. దీని అందాలను తిలకించడానికి అక్కడ నిర్మించిన విజిటర్స్ పాయింట్ కూడా దీని తీవ్రతకు దాదాపుగా మునిగిపోయింది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా జల వనరుల మంత్రిత్వ శాఖ తాజా నిర్ణయాన్ని తీసుకుంది. బొగత జలపాతాన్ని సందర్శకుల కోసం మూసివేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ సందర్శకులుఎవరికీ కూడా జలపాతం వద్దకు వెళ్లడానికి అనుమతి ఉండదు. బొగతతో పాటు ముత్యం ధార, కొంగల, మామిడిలొద్ది, కృష్ణాపురం వంటి వాటర్ ఫాల్స్ అన్నింటినీ కూడా మూసివేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ సందర్శకులెవరినీ అనుమతించరు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించి సందర్శకులు ఎవరైనా అటు వెళ్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# తప్పిన పెను ఉగ్రప్రమాదం

అరెస్టైన వారిని మొహమ్మద్ ఫైక్, మొహమ్మద్ ఫర్దీన్, సైఫుల్లా ఖురేషీ, జీషాన్ అలీగా గుర్తించారు. నకిలీ కరెన్సీ వ్యాపారం నిర్వహించే ఈ నలుగురూ అల్?-ఖైదా ఉగ్ర సిద్ధాంతాలను ప్రచారం చేయడం వంటి కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నట్లు సమాచారం. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం ఈ తీవ్రవాదులు సోషల్ మీడియా వేదికలు, ఆటో-డిలీట్ ఫీచర్ ఉండే అనుమానాస్పద యాప్‌లు ఉపయోగించి తమ సంభాషణలు సాగిస్తూ అల్?-ఖైదా సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్నారు. చాలా కాలంగా వీరికి ఈ ఉగ్ర సంస్థతో సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఈ నలుగురు గుజరాత్‌లో ఉగ్రచర్యలపై చర్చలు జరుపుతున్న సమయంలో గుర్తించినట్లు ఏటీఎస్ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం అనుమానాస్పద చాటింగ్ సమాచారం, సోషల్ మీడియా ఖాతాలను విశ్లేషిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నలుగురు నిందితులను విచారిస్తున్నట్లు కూడా తెలిపారు. అల్?-ఖైదా మక్తబ్ అల్ ఖిదమత్ అనే సంస్థ నుంచి ప్రారంభమైంది. దీన్ని ఓసామా బిన్ లాడెన్ గురువు షేక్ అబ్దుల్లా అజ్జామ్ స్థాపించాడు. తొలినాళ్లలో ఇది అఫ్గనిస్థాన్‌లో ఉగ్రవాదులకు నిధులు సమకూర్చే సంస్థగా పనిచేసింది. 1991 వరకు అల్?-ఖైదా ప్రధానంగా అఫ్గన్, పాకిస్థాన్ పెషావర్ ప్రాంతాల్లో పనిచేసింది. 1996 నుంచి 2001 వరకు తాలిబన్ పరిరక్షణలో అఫ్గన్ కేంద్రంగా ఓసామా బిన్ లాడెన్ నేతృత్వంలో అల్‌ఖైదా పనిచేసింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో జరిగిన అనేక ఉగ్రదాడుల్లో ఈ సంస్థ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొంది. ఇక, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత మరింత అప్రమత్తమైన భద్రతా బలగాలు దేశవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో పలు రాష్ట్రాల్లో ఉగ్రవాదుల కదలికలు వెలుగులోకి వస్తున్నాయి. అలాగే, పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఏజెంట్లు, దానికి సహకరించేవారిని అరెస్టులు చేస్తున్నారు.

## యూపీలో అక్రమాలు..
# హైదరాబాద్‌లో సోదాలు

పుదిపెద్ద సత్యమూర్తి ఇళ్లల్లో సోదాలు చేస్తున్నారు. సీబీఐ గతంలో 2020లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో, ఎస్ఈడబ్ల్యూ ఎల్ఎస్వై హైవేస్ లిమిటెడ్ రూ. 300 కోట్ల టర్మ్ లోన్‌ను పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి పొంది, రూ. 108 కోట్లను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు చేసింది. ఈ రుణం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర హైవే అథారిటీ ప్రాజెక్టు కోసం సాంక్షన్ చేశారు. కానీ కంపెనీ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయలేకపోయింది ఎస్ఈడబ్ల్యూ ఎల్ఎస్వై హైవేస్ లిమిటెడ్, పీఎన్బీ నేతృత్వంలోని 14 బ్యాంకుల కన్సార్టియం నుంచి రూ. 1700 కోట్ల రుణం, రూ. 300 కోట్ల ఫైనాన్షియల్ క్రెడిట్ లిమిట్‌ను పొందింది. ఈ కన్సార్టియంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్, దెనా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఇప్పుడు ఎస్బీఐ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్ (ఇప్పుడు ఎస్బీఐ), స్టేట్ బ్యాంక్ ఆఫ్ పటియాలా (ఇప్పుడు ఎస్బీఐ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయా బ్యాంక్ (ఇప్పుడు బ్యాంక్ ఆఫ్ బరోడా) ఉన్నాయని సీబీఐ చెప్పింది. సీబీఐ దర్యాప్తులో, కంపెనీ ఈ రుణాలను గ్రూప్ కంపెనీ ఎస్ఈడబ్ల్యూ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్‌కు బదిలీ చేసి దుర్వినియోగం చేసినట్లు తేలింది, ఇది అక్రమమైనదని ఫోరెన్సిక్ ఆడిట్‌లో గుర్తించారు. రుణ నిధులు ప్రాజెక్టు కోసం ఉపయోగించబడకుండా, గ్రూప్ ఎంటిటీ అకౌంట్స్‌కు డైవర్ట్ చేశారు. కంపెనీ ప్రాజెక్టు షెడ్యూల్‌ను పాటించలేకపోయింది, దీని వల్ల రుణాలు నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ గా మారాయి, బ్యాంకులకు గణనీయమైన నష్టం వాటిల్లింది. ఈ సోదాల సమయంలో, ఈడీ ఇంక్రిమినేటింగ్ డాక్యుమెంట్స్, బ్యాంక్ ట్రాన్సాక్షన్ రికార్డులు, డిజిటల్ ఆస్తులను స్వాధీనం చేసుకుంది. ఈ ఆధారాలు కంపెనీ రుణ నిధులను దుర్వినియోగం చేసి, షెల్ కంపెనీల ద్వారా మనీ లాండరింగ్ చేసినట్లు తేలిందని చెబుతున్నారు.

# అలుగు పోస్తున్న చెరువులు

మహబూబాబాద్,: మహబూబాబాద్ లో నిన్నటి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలోని చెరువులు, కుంటలు అలుగులు పోస్తున్నాయి. చెరువులన్నీ నిండి నిండుకుండలా కనిపిస్తున్నాయి. చెరువులు అలుగులు పోయడంతో మత్స్యకారులు, రైతులు ఆనందంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

## బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి

మహబూబ్‌నగర్, : దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్న చింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో మెయిన్ రోడ్డు నుండి ఉంద్యాల తాండవరకు రూ. 2. 70 లక్షలతో నిర్మిస్తున్న బీటీ రోడ్ నిర్మాణానికి బుధవారం రాష్ట్ర పశుసంవర్ధక, యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహేష్ మృతదేహం లభ్యం

వనపర్తి, : వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని స్థానిక మూలమల గ్రామ శివారులో గత ఆదివారం రోజు జూరాల ప్రాజెక్టు వద్ద గల్లంతైన బూడిదపాడు గ్రామానికి చెందిన మహేష్ మృతదేహం లభ్యమైనది. బుధవారం కృష్ణానది పరివాహక ప్రాంతమైన మూలమల గ్రామ శివారులో మత్సకారులు మహేష్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు అప్పచెప్పారు.

## శ్రీ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో రుద్ర హోమం

నిజామాబాద్,: నిజాంబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రోజున ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని రుద్ర హోమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాజుకిరణ్, వాసులు తెలిపారు. ప్రతి నెల ఆరుద్ర నక్షత్రం రోజున ఆలయంలో రుద్ర హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రాములు జూనియర్ అసిస్టెంట్ కిషోర్ తానేష్ మల్లేష్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కళతప్పిన జలాశయాలు..
# ఆందోళనలో రైతులు

కామారెడ్డి, : కామారెడ్డి జిల్లాలో వర్షాకాలం మొదలయిన నెలరోజుల నుండి వానలు లేకపోవడంతో నిండు కుండల ఉండాల్సిన జలాశయాలు వెల వెల బోతున్నవి. ప్రధాన ప్రోజెక్టులయిన నిజాంసాగర్, కౌలాస్ నాలా, పోచారం ప్రాజెక్ట్ లో నీటిమట్టం అడుగంటింది. దీనితో ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భారీ వర్షాల పట్ల ప్రజలు
# అప్రమత్తంగా ఉండాలి

పాలేరు,: భారీ వర్షాల నేపథ్యంలో వైరా నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే 3 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అత్యవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని సూచించారు. అటు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు చేపట్టాలని ఆయా మండలాల అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

## పరకాల పట్టణంలో
# బంధు విజయవంతం

పరకాల,: పరకాల పట్టణంలో ప్రైవేట్ స్కూలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం బందుకు బుధవారం మద్దతు తెలిపారు. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఇఒ, డిఇఒ పోస్టులు భర్తీ చేయాలి. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి. పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలి, తదితర, సమస్యల కోసం బంద్ పాటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ నాయకులకు పార్టీలకతీతంగా బీసీ జర్నలిస్టు ఏకం కావాలి: నీలకంఠం ముదిరాజ్

- రాజకీయ పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థులను గెలిపించుకుందాం
- బీసీ రిజర్వేషన్ అమలుకై పోరాటం చేద్దాం
- బీసీల రాజ్యాధికారం సాధిద్దాం
- మనమెంతో మన వాటా అంతా, బీసీల సత్తా చూపిద్దాం
- బీసీ జర్నలిస్టులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి







**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్)** సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ రాష్ట్ర బిసి జర్నలిస్టు జేఏసీ ఆధ్వర్యంలో బిసి జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం మరియు భవిష్యత్తు కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బిసి జేఏసీ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతల నీలకంఠం ముదిరాజ్, కొత్త లక్ష్మణ్ పటేల్ మున్నూరు కాపు,యాదవ జర్నలిస్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల కృష్ణ, రాష్ట్ర గౌడ జర్నలిస్టు అధ్యక్షులు సప్తగిరి గౌడ్,అమర్ పద్మశాలి, బిసి కులాల జర్నలిస్టులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి జర్నలిస్టు లు ఏకం కావాలని పిలుపు నిచ్చారు. రాజకీయ నాయకులకు సలహాలు సూచనలు ఇచ్చే జర్నలిస్టులు మన బాగు గురించి నిర్ణయాలు తీసుకోవడం లేదు అని అన్నారు. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే బిసి ల అందరిని గెలిపించు కోవాలని పిలుపు నిచ్చారు.చట్ట సభల్లో మన గొంతు వినిపించడానికి బీసీ కోటా కింద జర్నలిస్ట్ కు ఎమ్మెల్సీ గా ప్రతి రాజకీయ పార్టీ బీసీ నాయకులకు అవకాశం ఇవ్వాలని, పార్టీలకు అతీతంగా బీసీ జర్నలిస్టును ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ జర్నలిస్టులకు ప్రెస్ అకాడమీ చైర్మన్ పదవిని ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.బీసీ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థలు ప్రైవేటు కళాశాలలో 50% రాయితీ కల్పించాలని, అక్రిడేషన్ కార్డు మరియు హెల్త్ కార్డు, పత్రికలు మరియు యూట్యూబ్ ఛానల్ ను ప్రభుత్వం గుర్తించి అక్రిడేషన్ కార్డు కేటాయించాలని ఏబిసిడి వర్గీకరణ తీసివేయాలని బీసీ జర్నలిస్ట్ నాయకులు డిమాండ్ చేశారు. మనమెంతో మన వాటా అంతా అని రాజకీయంగా ఆర్థికంగా బీసీ నాయకులు ఎదగాలని అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలని రాజకీయంగా బీసీ నాయకులు ఉన్నత పదవిలో ఉన్నప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని రాజకీయ పార్టీల నాయకులకు అతీతంగా బీసీ జర్నలిస్టు బీసీ కుల సంఘాలు అందరూ ఐక్యంగా ముందుకు రావలసిన సమయం ఆసన్నమైందని రాబోయే ఎన్నికల్లో ప్రతి చోట బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మన పై ఉన్నదని జర్నలిస్టు మిత్రులు తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని రాబోయే ఎన్నికల్లో బీసీ జర్నలిస్టుల సత్తా చూపాలని ఈ సందర్భంగా బీసీ జర్నలిస్టు నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బిసి జర్నలిస్ట్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, మల్లేష్ ముదిరాజ్, సుగ్రీవుడు ముదిరాజ్, సిద్ధులు,వేణు గోపాల్, కిరణ్, సతీష్ ముదిరాజ్, బాపట్ల కృష్ణమోహన్, ఓంకారం సంతోష్ రాజ్ బిసి సంఘాల జేఏసీ జర్నలిస్టు లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బంద్ విజయవంతం

**- ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు ప్రణయ్**




రాజేంద్రనగర్( ప్రశ్న న్యూస్)ఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ మండలం కోశాధికారి సంజయ్ అధ్యక్షతన బందు నిర్వహించిన బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం లో బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బంధు విజయవంతం అయిందని నాయకులు తెలిపారు.ఈ సందర్భంగాఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ మండల అధ్యక్ష కార్యదర్శి జాజాల తనిష్క్ యాదవ్ శ్రీకాంత్ ఇరువురు హాజరై వారు మాట్లాడుతూప్రభుత్వ ప్రైవేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్ విద్యాసంస్థల బందు విజయవంతం అయిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కేవై ప్రణయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు విద్యాసంస్థల బంధు నిర్వహించడం జరిగిందని అన్నారు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక వసతులు కల్పించాలని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయాలని ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు ఎంఈఓ డిఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కార్పొరేట్ విద్యాసంస్థలైన చైతన్య నారాయణ కళాశాలలు, పాఠశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని రాష్ట్రవ్యాప్తంగా బందు నిర్వహిస్తున్నామని అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్స్ విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలని ఖాళీగా ఉన్న ఎంఈఓ డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.రాజేంద్రనగర్ మండల కేంద్రంలో బందుకు సహకరించిన ప్రభుత్వ విద్య అధికారులు టీచర్స్ ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో , ఎస్ఎఫ్ఐ రాజేంద్రనగర్ మండల ఎస్ఎఫ్ఐ నాయకులు సామంత్. సోను. బన్నీ. రేవంత్. వంశీ. దీక్షిత్ మహేష్.తదితరులు పాల్గొన్నారు.ం

### వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా

## కొనసాగుతున్న బంద్

వరంగల్ ఈస్ట్,: వరంగల్ జిల్లాలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి.రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ వ్యవస్థపై నిరసిస్తూ పది విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు.

బంద్ పిలుపును ఉల్లంగిస్తూ వరంగల్ నగరంలో పలు విద్యాలయాలు తెరచిన యాజమాన్యాలు, వరంగల్ లోని పలు స్కూల్ లో హాజరైన విద్యార్థులను బయటకి పంపించి విద్యార్థి సంఘాలు తాళాలు వేయించారు.

## తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు

భద్రాచలం, : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద చేరింది. బుధవారం వరద ఉధృతి పెరగడంతో 15 గేట్లు ఎత్తి 28వేల క్యూసెక్కుల నీటిని గోదావరికి విడుదల చేశారు. ఎగువ ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో వర్షాల కారణంగా వాగులు ఉప్పొంగుతున్నాయి. తాలిపేరు ప్రాజెక్టు నుంచి వరద పరవళ్లు తొక్కుతూ ఉండటంతో దిగువ తేగడ వద్ద లో లెవల్ చప్టా నీటిమునిగింది. అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

వైరా, : కారేపల్లి లో బుధవారం డివైఎఫ్ఎ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతంగా సాగిందని డివైఎఫ్ఎ నాయకులు ఆదేర్ల వినయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలని, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఎ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఎర్రుపాలెంలో స్థానిక సంస్థల కార్యశాల

మధిర, : ఎర్రుపాలెం మండలంలో స్థానిక సంస్థల కార్యశాల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు కొమ్మినేని కృష్ణారావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్య అతిథులుగా మధిర అసెంబ్లీ అభ్యర్థి పెరుమలపల్లి విజయ రాజు, సిరివెళ్ల సాంబశివరావు కన్వీనర్ డి. కోటేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో అనుమోలు సురేష్, కత్తి రవి లక్కిరెడ్డి, కృష్ణారెడ్డి, గరికపాటి పురుషోత్తం, రావేలా అచ్చారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు వాగు

డోర్నకల్, : మహబూబాబాద్ శివారు మున్నేరు వాగు నిన్నటి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తుంది. బుధవారం విద్యార్థులకు బంద్ కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నూరు వాగు చూసేందుకు పట్టణవాసులు మున్నేరు బ్రిడ్జి వద్దకు వస్తున్నారు. పోలీస్ శాఖ వారు ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుచున్నారు.

### మామిడి తోటలో పాటించాల్సిన

## సమగ్ర సస్యరక్షణ చర్యలు

ఆందోల్, : అందోల్ మండలము రాంసానిపల్లి గ్రామంలో బుధవారం మామిడి తోటను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డా. నిర్మల మరియు డా. అరుణ పరిశీలించారు. ఈ మాసంలో మామిడితోటలో ముఖ్యంగా పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, రైతులకు తెలియజేశారు. ప్రధానంగా ఈ మాసములో మామిడితోటలో కొమ్మల కత్తిరింపు చేయాలి. తోటలో ఎక్కడ అయితే బలహీన కొమ్మలు, ఎండిన కొమ్మలు ఉన్నట్లు అయితే వాటిని కత్తిరింపు చేయాలి, ప్రూనింగ్ కూడా క్రమ పద్ధతిలో చేసుకోవడంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.

### ఉపాధ్యాయులు శిక్షణ

## సద్వినియోగం చేసుకోవాలి

సంగారెడ్డి, : పాఠశాలలో రీడింగ్ కార్నర్ పై ఉపాధ్యాయులు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఆర్పిలకు శిక్షణ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో రీడింగ్ కార్నర్ లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏఎంవో బాలయ్య పాల్గొన్నారు.

## పీఎం శ్రీ పాఠశాలకు రూ 10 లక్షల చొప్పున నిధులు

నారాయణఖేడ్, : జిల్లాలో అటల్ టింకరింగ్ ల్యాబ్ కింద ఎంపికైన పిఎంశ్రీ 37 ఉన్నత పాఠశాలలకు రూ 10 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి తెలిపారు. కొండాపూర్ మండలం తోగర్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో రోజు సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధించేందుకు సైన్స్ ల్యాబ్ లను మంజూరు చేసినట్లు చెప్పారు.

### మృతురాలి కుటుంబ సభ్యులకు

## ఆర్థిక సహాయం అందజేత

సిద్దిపేట, : సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో మునిగడప లింగమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన విషయాన్ని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తెలుసుకొని బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, తక్షణ సహాయంగా 5000 రూపాయలు అందజేశారు. వారితో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ బీజేపీ అధ్యక్షులు మనోహర్ యాదవ్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్, తదితరులు ఉన్నారు.

### నేటి నుంచి అందుబాటులోకి

## వంద పడకల ఆసుపత్రి

ఆలంపూర్,: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం, అలంపూర్ చౌరస్తా నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రి ఎట్టకేలకు ప్రజలకు అందుబాటులోకి రానుంది. బుధవారం ఓపీ సేవలు ప్రారంభించినట్లు ఇన్చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సయ్యద్ భాషా తెలిపారు. ఈ మేరకు నేటి నుంచి ప్రజలకు వైద్య సదుపాయం అందించనున్నారు.

## బీటీ రోడ్ నిర్మాణానికి మంత్రి శ్రీహరి భూమి పూజ



దేవరకద్ర, : దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం ఉంద్యాల మెయిన్ రోడ్డు నుండి రూ. 2కోట్ల 70 లక్షల నిధులతో ఉంద్యాల తాండవరకు నిర్మిస్తున్న బీటీ రోడ్ నిర్మాణానికి బుధవారం మంత్రి వాకిటి శ్రీహరి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలలో రహదారులు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కారును ఢీకొన్న బైక్.. ఒకరికి గాయాలు

నిర్మల్, నిర్మల్ లోని జాతీయ రహదారి 61 పై బుధవారం ఉదయం కారు బైక్ ఢీకొని ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం అతి వేగంగా నడపడం తోనే కారు ముందుభాగం మొత్తం ధ్వంసమైంది. రోడ్డు ప్రమాదం జరగడంతో సుమారు అరగంట పాటు రాకపోకలకు ఇబ్బందులయ్యాయి. గాయాల పాలైన ద్విచక్ర వాహన దారున్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. యూ టర్న్ పై ఎలాంటి ప్రమాద సూచికలు లేకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు.

### ఉప్పొంగిన ఎర్రవాగు..

## చిక్కుకున్న ట్రాక్టర్

బెల్లంపల్లి, : ఇటీవల కురుస్తున్న వర్షాలతో భీమిని మండలం చిన్న తిమ్మాపూర్ ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ట్రాక్టర్లో ఉన్న రైతు కూలీలు వాగు దాటుతుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ వరద ఉధృతిలో చిక్కుకుంది. త్రుటిలో రైతు కూలీలు ప్రాణాలను దక్కించుకున్నారు. వరద ఉధృతిలో కొట్టుకుపోయే ప్రమాదం నుంచి నలుగురు వ్యక్తులు తప్పించుకుని ఒడ్డుకు చేరారు. బుధవారం ఈ సంఘటన భీమిని మండలంలో కలకలం రేపింది.

## 25న మెగా జాబ్ మేళా

ఖానాపూర్, : నిరుద్యోగ యువతి, యువకుల మేలు కోసం జూలై 25న ఉట్నూరు పట్టణంలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నామని టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణక్క తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఉట్నూరు పట్టణంలోని జెసిఎన్ గార్డెన్స్ లో శుక్రవారం ఉదయం 10 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మెగా జాబ్ మేళా ఉంటుందన్నారు. ఇందులో సుమారు 50 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాలను భర్తీ చేస్తారన్నారు. తగిన ఆశక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వర్షం నీళ్లతో జలమయమైన కాలనీలు

కరీంనగర్, : కరీంనగర్ నగరంలో రాత్రి నుంచి వర్షం పడుతోంది. పట్టణంలోని పలు కాలనీలు మొత్తం జలమయమైంది. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నారు. ప్రతి సారి వర్షం పడినప్పుడు ఇదే పరిస్థితి ఉంటుందని కాలనీవాసులు అంటున్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతోనే వర్షపు నీరు కాలనీలో ఆగి ఇంట్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

మానకొండూరు,: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్ ప్లాజా వద్ద బుధవారం రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా, ఒక పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులు క్షతగాత్రులను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కారు హైదరాబాదు నుండి కరీంనగర్ వెళుండగా ప్రమాదం. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండి ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి



రామగుండం, : వర్షాకాలం సీజనల్ వ్యాధులు వచ్చే సమయం కావడంతో చికిత్స కోసం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులు బారులు తీరి కనిపిస్తున్నారు. ప్రధానంగా జ్వరము, టైఫాయిడ్, మలేరియా వ్యాధులతో పిల్లలు, పెద్దలు చికిత్స పొందుతున్నారు. నిత్యం వెయ్యికి పైగా పేషెంట్లు చికిత్స చేయించుకుంటున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మంచినీటిని వాడాలని వైద్యులు చూస్తున్నారు.

### రామగుండం పరిసరాల

## పరిశుభ్రతపై కళాజాత ప్రదర్శన




మంథని, : వందరోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా రామగుండం కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది బుధవారం గోదావరిఖని ఫైవ్ ఇంక్లైన్ లైన్ చౌరస్తా వద్ద కళాజాత ప్రదర్శన నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, చెత్త రీసైక్లింగ్ చేయడం, కుక్క కాటు బారిన పడకుండా కాపాడుకోవడం, తదితర అంశాలపై అవకాశం కల్పిస్తారు. మల్లాపూర్ రోడ్డులో ఇరువైపుల ఉన్న ముళ్ళ పొదలను తొలగించారు. విట్టల్ నగర్ లో మరుగుదొడ్లను శుభ్రం చేశారు.

## విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి




కొత్తగూడెం, : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుదవారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్ నిర్వహించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా కోశాధికారి గాజుల శశికిరణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నగేష్, అభిలాష్, అనిల్, రియాజ్ కిషోర్ పాల్గొన్నారు.

## ఉద్యమ నాయకురాలికి అండగా ఉందాం

**- జాడి మంజులను పరామర్శించిన బొమ్మెర శ్రీనివాస్**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఉద్యమ నాయకురాలు, విద్యార్థి, మహిళా నాయకురాలు జాడి మంజుల గత కొంత కాలంగా గుండె, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ వారి స్వగృహానికి వెళ్ళి పూర్తి విషయాలు తెలుసుకుని ధైర్యం చెప్పిన ఆయన ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆమె గత నేపథ్యాన్ని పరిగణలోకి తీసుకుని మాతృ సంస్థలైన విప్లవ పార్టీ నాయకులు ఎందుకు స్పందించట్లేదనే భాదను వ్యక్తం చేశారు. మహిళా నాయకురాల్ని కాపాడలేని పరిస్థితిలో వారు ఉన్నారా అంటూ తెలంగాణ ఉద్యమంలో పని చేసిన మహిళా నాయకురాలు అనారోగ్య పరిస్థితి చూసి చలించిపోయి భావోద్వేగానికి గురయ్యారు. ఇలాంటి పరిస్థితిలో మంజుల కుటుంబానికి తమ వంతుగా ఆర్థికంగా తోడ్పాటు అందిస్తామని బొమ్మెర శ్రీనివాస్ అన్నారు. అదే క్రమంలో తోటి ఉద్యమకారులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, సామాజిక, రాజకీయ, ప్రజా, మహిళ సంఘాల నాయకులు మానవత్వంతో స్పందించి మహిళ ఉద్యమకారురాలైన మంజులని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రతి ఒక్కరు తమ వంతు సాయం చేయాలని కోరారు. ఫోన్.పే /గూగుల్ పే ద్వారా 9640542368 ద్వారా వారికి సహాయం చేయాలన్నారు.

## ప్రజా నాయకుడు కేటీఆర్ లా ఉండాలి: ముస్తాక్

**- సమస్య ఉంటే నేనున్న అనే నాయకుడు కేటీఆర్**



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** గర్వం అంటే తెలియని నాయకుడు పదిమందికి దారి చూపే నాయకుడు అమెరికా దేశంలో ఉద్యోగం చేసుకుంటూ తన ఉద్యోగాన్ని వదిలి తెలంగాణ రాష్ట్రం సాధించాలన్న ఆకాంక్షతో తెలంగాణ రాష్ట్రం సాధించడంలో కీలక పాత్ర పోషించిన నాయకుడు కేటీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటున్నామని రామంతపూర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షులు ముస్తాక్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్రం సాధించాక ఐటీ శాఖ మంత్రిగా రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చి ఎంతో మంది యువతకు ఉపాధి కల్పించిన నాయకుడు కేటీఆర్ అని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన నేత కేటీఆర్ అలాంటి నాయకుడు మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధించాలని ఈ సందర్భంగా ముస్తాక్ అన్నారు.

### మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం

# మరో మైలు రాయి

**- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**



**మంథని ( ప్రశ్న న్యూస్)** ప్రజా పాలనలో గత 18నెలల్లో 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటి ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా కొనసాగుతుందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మహాలక్ష్మి పథకం 200 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు జరిగి మరో మైలురాయిని నెలకొల్పుకున్న సందర్భంగా మంథని బస్ స్టేషన్ లో మహిళలతో కలిసి బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు రాష్ట్రంలో ఏ ప్రదేశానికైనా ఉచితంగా వెళ్లే అవకాశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మేనిఫెస్టోలో పెట్టిన మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం చేసుకునే అవకాశం కల్పించారని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు ఈ సందర్భంగా మహిళల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను ఇందిరా క్రాంతి పథకం ద్వారా కోటీశ్వరులను చేసేందుకు గాను కాంటిన్లు, కుటీర పరిశ్రమలు, ఆర్టీసీలో అద్దె బస్సులు నడుపుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందని అన్నారు. అంతే కాకుండా మహిళలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు మంజూరు ఇస్తుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి చిరు కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీఈఆర్సి సలహాదారు కాచే శశిభూషన్, ఆర్టిఏ మెంబర్ మంథని సురేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుడుదుల వెంకన్న, యూత్ మండల అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, యూత్ పట్టణ అధ్యక్షుడు పె%శీ%టరి రాజు, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా మీడియా ఇంచార్జ్ అరెల్లి కిరణ్, కాసిపేట బాపు, డిపో మేనేజర్ శ్రవణ్ కుమార్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లావణ్య,నాయకులు నితీష్, శైలేందర్, పెద్ద సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు

## మత్తు బాబులకు పోలీసుల కౌన్సిలింగ్

తిరుపతి జిల్లా పొఓలీసులు మత్తు ఇంజక్షన్లు తీసుకుంటున్న వారిపై స్పెషల్ టీంలతో నిఘా పెట్టడం జరిగిందని తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవింద్ అన్నారు. బైరాగిపట్టెడ సమీపంలోని లింగేశ్వర నగర్ వద్ద చెట్లు పొదలలో రహస్యంగా నలుగురు యువకులు మత్తు ఇంజక్షన్ తీసుకుంటున్న దృశ్యాలు డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించారు. యువకులను ఈగల్ టీం, డ్రోన్ టీం సిబ్బంది పట్టుకుని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు.లింగేశ్వర నగర్ లో నివాసం ఉండే యువకులుగా గుర్తించారు. యుక్తవయస్సు లో ఇలాంటి చేడు వ్యసనాలకు బానిసలుగా మారి మీ భవిష్యత్ ను మీరే పాడు చేసుకొవద్దని మత్తు ఇంజక్షన్లకు బానిసలైన యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.యువకులకు పోలీసు వారు కౌన్సిలింగ్ ఇవ్వడం తోపాటు... వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పోలీస్ స్టేషన్ కు పిలిచారు. మత్తు ఇంజక్షన్స్ తీసుకోవడం వలన జరిగే పరిణామాల గురించి తల్లిదండ్రులకు పోలీసులు వివరించారు.అంతే కాకుండా వారిపై కేసు నమోదు చేస్తే... వారి బంగారు భవిష్యత్ మధ్య లోనే అగిపోతుందని తల్లిదండ్రులకు చెప్పారు. తల్లితండ్రుల అనుమతితో యువకులను వైద్యుల సూచనల మేరకు యువకులను రిహబిలేషన్ సెంటర్ కు పంపి కౌన్సిలింగ్ ఇచ్చారు.

# నిర్మాణాలు సరే.. అనుమతులేవి.?

**- నల్లగండ్ల హుడా లేఅవుట్ చౌరస్తాలో అనుమతులు లేకుండా భారీ నిర్మాణం**
**- అక్రమార్కులకు అండగా అధికారులు - ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి**



**శేరిలింగంపల్లి( ప్రశ్న న్యూస్)** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. వీటిని ఆపాల్సిన (నిర్మూలించాల్సిన) అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి వారికి అండగా నిలుస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అధికారుల ప్రోద్భలంతోనే భారీగా అక్రమ నిర్మాణాలు, అదనపు అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నల్లగండ్ల హుడా లేఅవుట్ చౌరస్తాలో..

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని నల్లగండ్ల హుడా లేఅవుట్ చౌరస్తా మెయిన్ సెంటర్లో ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు కటింగ్ లో ఉన్న బిల్డింగ్ నిర్మాణం జరుగుతున్నది. చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత శాఖల అధికారులు మౌనం వహించడంపై విమర్శలకు తావిస్తోంది.

గతంలో నిర్మాణాలు ఆపిగతంలో ఉన్న జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇక్కడ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలను నిలిపివేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు మాత్రం నోరు మెదపడంలేదు.

### ప్రభుత్వ ఆదాయానికి గండి..

అక్రమ నిర్మాణలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడుతోంది. ఇంటి నిర్మాణాలు శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఎన్నో జరుగుతున్నా అధికారులు మాత్రం అడ్డుకోలేకపోతున్నారు. అక్రమ నిర్మాణాలపై పలు మార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని సామాన్య ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించి తమ నిబద్ధతను చాటుకోవాలని కోరుతున్నారు.



## మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌ని సన్మానించిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ని బుధవారం మినిస్టర్ క్వార్టర్స్ లో ఓయూ జెఏసి చైర్మన్ కొత్తపల్లి తిరుపతి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ లోకి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ను తీసుకోవడం వలన మాదిగ సమాజం మొత్తం హర్షం వ్యక్తం చేసిందన్నారు. అందుకు మాదిగ సమాజం మొత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రుణపడి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ముఖ్యంగా యూనివర్సిటీ లో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలు,ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని మంత్రి కి వినతిపత్రం ఇచ్చామన్నారు. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ యూనివర్సిటీలలో విద్యార్థులకు సరిపడా హాస్టల్స్ లేవని అందుకు నూతన హాస్టల్స్ నిర్మించాలని, మౌలికవసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఈ విషయాలను సావధానంగా విన్న మంత్రి సానుకాలంగా స్పదించి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు రాజేందర్, రమేష్, శివాజీ, ప్రకాష్, శ్రీనివాస్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బనకచర్ల ప్రాజెక్ట్ తో తెలంగాణకు అన్యాయం



**తార్నాక(ప్రశ్న న్యూస్)** ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని తుంగలో తొక్కుతూ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నాడని బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీడీ అనిల్, బిఆర్ఎస్వి నాయకుడు కొంపల్లి నరేష్ మండిపడ్డారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం తెలంగాణకు జరుగుతున్న అన్యాయం అనే అంశం పై బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఐక్య విద్యార్థి సంఘాలతో ఓయూ ఆర్ట్స్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ తెలంగాణ నీటి హక్కులు కాపాడాల్సిన ముఖ్యమంత్రి రేవంత్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రంలోని బీజేపీకి లొంగిపోయి లోపాయకారిగా సహకరిస్తున్నాడన్నారు. వెంటనే తెలంగాణ సమాజం మేలుకొనపోతే శాశ్వతంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అటువంటి పరిస్థితులు రాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉంటుందన్నారు.తక్షణమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టు ఆపాలని,లేని పక్షంలొ ఐక్య విద్యార్థి కలిసి మరో పోరాటానికి సిద్ధం అవుతాం అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ రమేష్, జార్జి రెడ్డి ఐ డి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి సుమంత్ , స్పోర్ట్స్ స్టూడెంట్స్ పెడరేషన్ ప్రెసిడెంట్ శాగంటి రాజేష్, నిరుద్యోగ జేఏసీ నాయకులూ కాశి, బిసి విద్యార్థి సంఘ నాయకులు చారి, తదితర ఓయూ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

# ఎన్ని ప్రభుత్వాలు మారిన పేదోడి బతుకు మారదు

- నిరుపేద కుటుంబాల దీనగాధలు
- ఇల్లు ఉన్నోడికి ఇల్లు భూమి ఉన్నోడికి భూమి
- నిరుపేదల నోట్లో మన్ను పోస్తున్న ప్రభుత్వాలు





**(దుర్గం విజయ్ బాబు-ప్రశ్న న్యూస్ బ్యూరో)**

అడవిలో దున్న కోవడానికి భూమి ఉండదు. ఊర్లో ఇల్లు ఉండదు. ఉన్న అతికొద్ది గజాల జాగాలో గుడిసెలు, పాత రేకులు కప్పుకొని వానకు తడవకుండా ఎండకు ఎండకుండా ఉందామనుకునే బ్రతుకులు బ్రతుకుతున్నారు. దిన దిన గండంగా కుటుంబాలను పోషిస్తూ కడుపునిండా తిండి తినకుండా, కంటి నిండా నిద్రపోకుండా కాలం వెలదీస్తున్న కుటుంబాలు ఎన్నో, ప్రభుత్వాలు మారుతున్నాయి ఏండ్లు గడుస్తున్నాయి పేదోడి బ్రతుకుల్లో మాత్రం మార్పు కనబడడం లేదు. పూట గడిస్తే చాలు అని దినదిన గండంగా బ్రతుకు వెలదీస్తున్న కుటుంబాలెన్నో, సగం కడుపుకు తిని కన్న పిల్లలకైనా కడుపునిండా తిండి పెడితే చాలు అనుకొని బ్రతుకుతున్న నిరుపేద కుటుంబాలు ఎన్నో. పెంట మీద చెత్తలాగా ఉన్నోడి ఆస్తులు పెరుగుతూ ఉంటే వాడికి ఊడిగం చేస్తూ బ్రతుకులు నెట్టుకొస్తున్న కుటుంబాలు మరెన్నో, స్వతంత్రం వచ్చి ఏండ్లు గడుస్తున్న పేదోడి బ్రతుకుల్లో మాత్రం మార్పు కనబడడం లేదు. రాజకీయ నాయకుల ఆస్తులు కోట్లల్లో పెరుగుతున్నాయి. అధికారుల అక్రమ ఆస్తులకు కొదువే లేదు. కానీ నిరుపేద బ్రతుకుల్లో మార్పు మాత్రం కనిపించడం లేదు.

### భూమి ఉన్నోడికి ప్రభుత్వ భూములు

ఎకరాల కొద్ది ఉన్న భూస్వాములు అనేక రకాల లబ్ధి పొందుతూ, ప్రభుత్వ భూములను కూడా కబ్జా చేస్తూ సాగు చేస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఖద్దరు బట్టలు వేసుకొని కార్లలో తిరుగుతూ ఉంటే పొలాన్ని దున్ని, ఒడ్డు చెక్కి నాట్లు వేసి మందు బస్తాలు మోస్తూ ఇచ్చిన పైసలు తీసుకొని కుటుంబాన్ని పోషిస్తున్న కుటుంబాలు ఎన్నో. తెల్ల బట్టలు వేసుకుని ఖరీదైన కార్లలో తిరుగుతూ విలాసవంతమైన జీవితాలు గడుపుతూ, అక్రమ ఆస్తులు కూడగట్టుకుని రాజ భోగాలు అనుభవిస్తున్న వారు ఎందరో ఉన్నారు. విలాస జీవితాలు అనుభవిస్తూ, ఖరీదైన కార్లలో తిరుగుతూ ఖద్దరు బట్టలు నలగకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ రాజకీయ నాయకులుగా పెద్ద మనుషులుగా చలామణి అవుతూ నిరుపేదలకు అందాల్సిన సొమ్ములను కాజేస్తూ, పూటకో పార్టీ మారుస్తూ నిరుపేదల కందాల్సిన పలాలను ఈ అందిన కాడికి దోచుకుంటూ మాయ మాటలతో నిండా ముంచుతున్న బ్రతుకులు బంగారు మయంగా మారుతున్నాయి. కానీ పేదవాడి బ్రతుకు మాత్రం మారడం లేదు.

### పని చేస్తేనే పూట గడిచే పరిస్థితి

కాలు నొప్పితో యూరియా బస్తాలు మోస్తున్న వ్యక్తి పేరు బోయిని బాబు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి. వ్యవసాయ భూములు కానీ, ఇతర ఆదాయ మార్గాలు లేక కాలు నొప్పితో కుటుంబాన్ని పోషించుకోవడం కోసం యూరియా బస్తాలను మోస్తూ ప్రశ్న న్యూస్ కెమెరాకు చిక్కాడు. భార్యాభర్తలు కూలి నాలి చేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. రేకులతో వేసుకున్న ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు మూడు ఇండ్లు ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తే, ఇండ్లు జాగలు ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం లబ్ధి చేకురిస్తే ఇలాంటి నిరుపేదలను మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీల పేరుతో బడా నాయకులకు జేజేలు కొట్టే వారికి, ముడుపులు చెల్లించే వారికి లబ్ధి చేకూరుతుంది కానీ ఇలాంటి నిరుపేదలకు మాత్రం ఎలాంటి లబ్ధి చేకూర్చకపోవడం చూస్తే మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారతదేశ పౌరుల పట్ల చూపిస్తున్న ప్రేమ ఎలాంటిదో అర్థం అవుతుంది.

# ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్ద పీట

- రూ.200 కోట్ల ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాలు
- ఇప్పటికైనా కేటిఆర్, హరీష్ రావు ఉచిత బస్సు ప్రయాణాలను స్వాగతించాలి
- త్వరలోనే తిప్పాపూర్ బస్టాండుకు నూతన శోభ
- వేములవాడ బస్సు డిపో ద్వారా 1.55 కోట్ల ప్రయాణాలు ద్వారా సుమారు రూ.57.66 కోట్లు ఆదా
- రాష్ట్ర ప్రభుత్వ విప్: ఆది శ్రీనివాస్
- వేములవాడ లో ఆర్టీసి సంబరాల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్





**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మరో మైలురాయిని అధిగమించిన నేపథ్యంలో వేములవాడ పట్టణంలోని ఆర్టీసి డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సంబరాల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళలను, విద్యార్థులను ప్రభుత్వ విప్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే కాంగ్రెస్ సర్కార్ 2023 డిసెంబర్ 9న మహాలక్ష్మి పేరిట మహిళల కోసం ప్రారంభించిన ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకం కింద గత 18 నెలల్లో రికార్డు స్థాయిలో 200 కోట్ల మంది ప్రయాణించారని తద్వారా 6680 మేర కోట్లు మహిళలు అదా అయ్యిందని తెలిపారు.ఇందిరమ్మ రాజ్యంలో చాలా వరకు మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మిగిలిన డబ్బులను ఆదాచేసుకొని వాటి ద్వారా చిట్టీలు వేస్తున్నామని మహిళలు చెప్పడం ప్రజా ప్రభుత్వనికి గర్వకారణం అన్నారు. వేములవాడలో డిపో పరిధిలో 6 మండలాలు పరిధిలో మహిళా ప్రయాణీకులు సుమారు 1 కోటి 55 లక్షలు మంది ప్రయాణం చేశారని తద్వారా 57 కోట్ల 66 లక్షలు రూపాయలను హెూదా చేసుకున్నారని ప్రతిరోజు సంఘటన 26,330 మంది మహిళలు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారని తెలిపారు. మహిళలకు 500 కే ఉచిత సిలిండర్, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయడం జరుగుతుందన్నారు..రైతులకు రుణమాఫీ,ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు.గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని కానీ ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు.ఆనాడు ఆర్టీసీ సంస్థ సంక్షోభంలో ఉండేదని కానీ ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసీ డిపోల్లో ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి తెలిపారు.బస్సు ప్రయాణాలు జరగడం వలన చిరు వ్యాపారులకు, కిరాణా దుకాణ దారులకు ఎంతో మేలు జర్నుతుందన్నారు.

## ఇప్పటికైనా కెటిఆర్, హరీష్ రావు ఉచిత బస్సు ప్రయాణంలను స్వాగతించాలి

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మూడు రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తొలినాళ్లలో మహిళను అవమానపరిచేలా మాట్లాడిన కెటిఆర్,హరీష్ రావు వారిని చులకనగా చూస్తూ మాట్లాడారని అన్నారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసి 200 కోట్ల ప్రయాణాలు చేశారని ఇప్పుడు కేటిఆర్ , హరీష్ రావు ఏమంటారని విప్ ప్రశ్నించారు.ఇప్పటికైనా కెటిఆర్ హరీష్ రావు మహిళలు క్షమాపణ చెప్పాలని ఈ పథకం దిగ్విజయంగా కొనసాగడం పట్ల వారు ప్రభుత్వానికి అభినందలు తెలపాలని సూచించారు. మహిళలు దర్జాగా ఆర్టీసి బస్సులు తమ స్వంత వాటిగా భావించి ప్రయాణాలు చేస్తున్నరని అన్నారు.మన ప్రాంతంలో బుస్సు ల సంఖ్య తక్కువగ ఉంటే మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బస్సుల సంఖ్య పెంచాలని కోరడం జరిగిందని ఇప్పటికే కొన్ని బస్సులను పెంచడం జరిగిందని త్వరలోనే ఇంకా బస్సుల సంఖ్య పెంచడం జరుగుతుందన్నారు.

## త్వరలోనే తిప్పాపూర్ బస్టాండ్ కు నూతన శోభ

గత ప్రభుత్వంలో తిప్పాపూర్ బస్ స్టాండ్ తీసివేస్తం అంటే నిలబడి దానిని ఆపడం జరిగిందన్నారు.. తిప్పాపూర్ నుండీ రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు.. భూ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.. రోడ్డు నిర్మాణం పూర్తయితే తిప్పాపూర్ బస్టాండుకు నూతన శోభ సంతరించుకుంటుందని తెలిపారు..మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లడి తిప్పాపూర్ బస్టాండ్ కి నూతన శోభ సంతరించుకునేలా బస్టాండును తీర్చి దిద్దుతానని తెలిపారు.

## మహిళలు కోటీశ్వరులు చేయడమే లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నారని తెలిపారు.. అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అన్నారు. అనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్లీ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లిలకు పేద్దపీత వేయడం జరుగుతుందని తెలిపారు..గతంలో వైఎస్ పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేశారని, ఐకేపీ కేంద్రాలను ప్రారంభం చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సాహం అందించాలని తెలిపారు.. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు 20వేల పైచిలుక కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలను ఏ మాత్రం పట్టించుకోలేదని చివరికి మూడు సంవత్సరాల వడ్డీని ఎగ్గొట్టినట్లు తెలిపారు..మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్,సిఐ విర ప్రసాద్,డిపో మేనేజర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మాజి కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్టీసి సిబ్బంది, ప్రయాణికులు తదితరలు పాల్గొన్నారు.

# ఇందిర మహిళ శక్తి సంబరాలు

## - ఆర్టీసీ డిపో మేనేజర్ వి.శ్రావణ్ కుమార్





**మంథని ( ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు , రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఈ సందర్భంగా మహిళల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళల జీవితాలలో పాజిటివ్ మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు .మహిళల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు వారి సామాజిక పాత్రను గుర్తించేందుకు ముఖ్య వేదికగా నిలిచిందని అన్నారురాష్ట్రంలో కోటి మంది మహిళలను ఇందిరా క్రాంతి పథకం ద్వారా కోటీశ్వరులను చేసేందుకు గాను కాంటిన్లు, కుటీర పరిశ్రమలు, ఆర్టీసీలో అద్దె బస్సులు నడుపుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందని అన్నారు.మహిళలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు మంజూరు చేయిస్తుందని అన్నారు.ఈ సందర్భంగా ప్రతిరోజు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే మహిళలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి చిరు కానుకలు అందజేశారు.మహాలక్ష్మి పథకంపై మంగళవారం జిల్లా పరిషత్ బాలిక పాఠశాల విద్యార్థులకు మంథని డిపోలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ చారిత్రాత్మక పథకం ద్వారా లక్షలాది మహిళలకు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడం ద్వారా వారి ఆర్థిక భాద్యతలను తగ్గించడమే కాకుండా, వారి ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛకు బలమైన దిశను అందించినట్లు పేర్కొన్నారు.ఇది కేవలం ప్రయాణం మాత్రమే కాకుండా మహిళల జీవితంలో మార్పు తీసుకువచ్చే ఉద్యమంగా మారిందని కొనియాడారు.దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న తెలంగాణ ఆర్టీసీ సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రజల రవాణా అవసరాల్ని అందరికీ సమానంగా అందిస్తూ, సమాజాన్ని ముందుకు నడిపించే సంకల్పానికి ఆర్టీసీ నిలబడి ఉందన్నారు.మహాలక్ష్మి పథకం అమలులో 200 కోట్ల ఉచిత మహిళా ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా, ఈ సందర్భంగా ఆర్టీసీ లో అత్యుత్తమ సేవలు అందించిన కార్మికులను ప్రత్యేకంగా సన్మానించడం జరిగింది.

మహిళల జీవితాల్లో వెలుగులు నింపే ఈ పథకం కొనసాగింపు కోసం అందరూ భాగస్వాములు కావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్, శశిభూషణ్ కాచే, ఆర్టిపి రాము, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, టౌన్ యూత్ అధ్యక్షులు పెంటరి రాజు, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుడుదల వెంకన్న, , కాసిపేట బాపు, యూత్ కాంగ్రెస్ నాయకులు నితీష్, శైలేందర్, ఫహీమ్ మహిళలు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పాలన అధికారి పరీక్షను సజావుగా నిర్వహించాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

## - గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై సమావేశం నిర్వహించిన కలెక్టర్



**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** గ్రామ పాలన అధికారి పరీక్షలను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన ఆదివారం ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలకు జిల్లాలో 39 మంది అభ్యర్థులు హాజరవుతారని, సిరిసిల్ల లోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారి నోడల్ అధికారిగా ఈ పరీక్షలు చేపడుతామని పేర్కొన్నారు.పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్, చేతి గడియారాలు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్షల ముగిసిన తర్వాత అభ్యర్థుల జవాబు పత్రాలను సీజ్ చేసి ఎస్కార్ట్ తో కన్వీనర్ జేఎన్టీయూ హైద్రాబాద్ కు పంపాలని కలెక్టర్ తెలిపారు.పరీక్ష కేంద్రంలో ప్రతి బెంచ్ కు ఒక అభ్యర్థి ఉండేలా చూడాలని అన్నారు. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 10 గంటలకు మూసివేయడం జరుగుతుందని, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత అభ్యర్థులను లోనికి అనుమతించవద్దని ఆదేశించారు. పరీక్షా సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, విద్యాలయం ఆవరణలో శానిటేషన్ పనులు చేపట్టాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలలో ప్రతి అరగంటకు అభ్యర్థులకు సమయం తెలిసేందుకు మోగాలని, పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ షాపులను మూసివేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో రామ్ రెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, ఎండీ సెస్ రామ సుబ్బారెడ్డి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా వైద్యాధికారి రజిత, గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ శారద, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఎంతో ఉపయోగం: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

- 3 కోట్ల ఉచిత బస్ టికెట్లపై జిల్లా మహిళలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ప్రయాణించారు
- 110 కోట్ల రూపాయలు ఆదా చేశారు



**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** మహాలక్ష్మి పథకం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం మొట్టమొదటి సారిగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతున్నది. 2023 డిసెంబర్ 9 నుంచి మహాలక్ష్మి పథకం అమల్లోకి రాగా.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల టికెట్లపై ఉచిత బస్ ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో సంబరాలు నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో బస్సులు నిర్వహించే సంస్థలు లేవని గుర్తు చేశారు. తెలంగాణ, కర్ణాటకలో మాత్రమే మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని అందిస్తున్నారని వెల్లడించారు. జిల్లాలోని మహిళలు దాదాపు 20 నెలల కాలంలో మూడు కోట్ల ఉచిత టికెట్లపై ప్రయాణం చేశారని వెల్లడించారు. దీంతో వారికి 110 కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని తెలిపారు మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆదా అవుతున్న డబ్బులను పిల్లల ఆరోగ్యం, ఉన్నత చదువులు, పొదుపు ఇతర మార్గాల్లో పెట్టాలని సూచించారు. మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఆయా డీఎంలు, ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.సిరిసిల్ల ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న స్థలాన్ని మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకు మహిళలు 200 కోట్ల ఫ్రీ టికెట్స్తో ప్రయాణం చేశారని, వాటి విలువ రూ.6,680 కోట్లు అని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్న పలువురు మహిళలను కలెక్టర్, డీఎంలు, అధికారులు సన్మానించారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం, మహిళా సాధికారత మొదలైన అంశాలపై విద్యార్థులకు వ్యాస రచన ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సంబురాల్లో సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ ప్రకాశరావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితులకు కలెక్టర్ ఆర్థిక సహాయం

- ఇద్దరు మహిళలకు రూ. 1,75,000 చెక్కులు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కృతజ్ఞతలు తెలిపిన ఆయా కుటుంబాల సభ్యులు



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లాలోని ఇద్దరు క్యాన్సర్ బాధిత మహిళలకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్థిక సహాయం అందజేశారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన నిరంక స్వప్న(లత), కోనరావుపేట మండలం వట్టెంల పరిధిలోని అజ్మీరా తండాకు చెందిన అజ్మీరా కళ క్యాన్సర్ తో ఇబ్బంది పడుతున్నారు. తమ వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని వారు బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు విన్నవించారు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ ఆ మహిళలకు ఆర్థిక సహాయం అందజేశారు. కోనరావుపేట మండలం వట్టెంల పరిధిలోని అజ్మీరా తండాకు చెందిన అజ్మీరా కళకు రూ. లక్ష సహాయం, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన నిరంక స్వప్న(లత), రూ. 75 వేల ఆర్థిక సహాయం చెక్కులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అందజేశారు. తమ ఇబ్బందుల పై వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు ఆయా మహిళల కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉన్నత చదువులకు

# పేదరికం అడ్డురాదు

## - మంథని గడ్డమీద సరస్వతి పుత్రుడు బేర ఆదిత్య తేజ



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024బి 25 విద్యా సంవత్సరానికి చాలా పేద కుటుంబానికి చెందిన వెంకటస్వామి, మల్లీశ్వరి దంపతులకు మూడవ సంతానంగా బేరా ఆదిత్య తేజ జన్మించి పదవ తరగతిలో 600 మార్కులకు గాను 561 మార్కులు సాధించి విజయ దుందిబితో బాసర త్రిబుల్ ఐ ఐ ఐ టి లో అడ్మిషన్ సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు ఎంతో పేరు తెచ్చి మంథని మారుమూల ప్రాంతాన్నే అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఉన్నత చదువులు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహద పడతాయని , తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్తానని సర్వతోముకాభివృద్ధికి పాటుపడతానని తాను ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేరుతానని తన తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచి ప్రభుత్వము అందించే సహకారంతో సమాజ శ్రేయస్ కు పాటుపడతానని . ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతోటి చదివి తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చడానికి ఇలాంటి పేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదివి గొప్ప ఆశయాలను నెరవేరుస్తారని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



## తోడు కావాలని ఉంది..
# కానీ : నిత్యామీనన్

కేరళ కుట్టి నిత్యామీనన్ తన పెళ్లి గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. జీవితంలో పెళ్లి ఓ ముఖ్యమైన భాగమే.. అయితే, పెళ్లి మాత్రమే జీవితం కాదని చెబుతోంది. తన లేటెస్ట్ మూవీ 'సార్ మేడమ్' రిలీజ్ కు రెడీ అవుతుండగా జోరుగా ప్రమోషన్స్ చేస్తోంది. ఈ సందర్భంగా ప్రేమ, పెళ్లిపై తన అభిప్రాయాలు ఫ్యాన్స్ తో పంచుకున్నారు. చాలా ఏళ్ల క్రితం ప్రేమ గురించి ఆలోచించా కానీ ఇప్పుడు అంత ఆసక్తిలేదని చెప్పుకొచ్చారు. చుట్టూ ఉన్న సమాజం, తల్లిదండ్రుల కారణంగా ఓ భాగస్వామి ఉండాల్సిందేనని అనిపించిందని.. ఓ దశలో తగిన భాగస్వామి కోసం వెతికానని కూడా చెప్పింది నిత్యా. అయితే, తనకు ఎదురైన కొన్ని అనుభవాలు జీవిత పాఠాలు నేర్పాయని.. ప్రతీ ఒక్కరూ ప్రేమించి పెళ్లి చేసుకోలేరు కాబట్టి వేరేరకంగా కూడా జీవితాన్ని ఆనందించవచ్చున్న సంగతి తర్వాత అర్థం చేసుకున్నానని చెప్పుకొచ్చింది. తోడు లేనందుకు ఒక్కోసారి బాధ కలిగినప్పటికీ, స్వేచ్ఛగా జీవిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఏం జరిగినా మన మంచికే అనుకొని ముందుకు సాగాలని వేదాంతం చెప్పుకొచ్చింది నిత్యామీనన్.

# సూర్య కూడా ఇలా చేస్తే ఎలా?



పర భాషా సినిమాలను తెలుగులోకి అనువాదం చేస్తూ ఒరిజినల్ టైటిళ్లను అలాగే పెట్టేయడం పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అసలు మనకు అర్థం కాని పదాలను అలాగే తెచ్చి తెలుగు వెర్షన్లకూ పెట్టేస్తుండడం విడ్డూరం. ఈ మధ్య మోహన్ లాల్ సినిమా 'తుడరుమ్'ను అదే పేరుతో తెలుగులోనూ రిలీజ్ చేశారు. ఇది మన ప్రేక్షకులకు ఆగ్రహం తెప్పించింది. సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ వచ్చినా.. తెలుగులో ఆదరణ దక్కించుకోలేకపోయింది. అంతకుముందు రజినీకాంత్ సినిమాకు 'వేట్టయాన్' అని పెట్టి వదిలేశారు. అది పెద్ద మైనస్ అయింది. ఇలాంటి టైటిళ్లు పెట్టడం వల్ల నష్టమేంటో స్పష్టంగా అర్థమవుతున్నా మేకర్స్ మారట్లేదు. ఐతే తెలుగు వారికి ఎంతో ఇష్టుడు.. ఇక్కడి వాళ్ల మీద ఎంతో ప్రేమ, గౌరవ భావం చూపించే తమిళ స్టార్ సూర్య సైతం ఇదే బాటలో నడుస్తుండడమే ఆశ్చర్యం కలిగించే విషయం. గత ఏడాది 'కంగువ' అనే సినిమాతో పలకరించాడు సూర్య. ఆ పేరేంటో మన వాళ్లకు అంతుబట్టలేదు. సినిమాలో విషయం లేకపోవడం సంగతి అటుంచితే.. అలాంటి టైటిల్ పెట్టి తెలుగులో రిలీజ్ చేయడం కరెక్ట్ కాదన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు సూర్య తన కొత్త చిత్రానికి 'కరుప్పు' అని పేరు పెట్టుకున్నాడు. ఆర్జే బాలాజి డైరెక్ట్ చేస్తున్న చిత్రమిది. తమిళంలో 'కరుప్పు' అంటే 'నలుపు' అని అర్థం. కానీ సినిమాలో హీరో పేరు కరుప్పుస్వామి అట. అందుకని దాన్ని షార్ట్ చేసి 'కరుప్పు' అనే పేరు ఖరారు చేశారు. కానీ ఇది హీరో పేరు అయినా సరే.. తెలుగులోనూ అదే టైటిల్ పెట్టి రిలీజ్ చేయడం అన్నది సరైన నిర్ణయమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ టైటిల్, పోస్టర్ చూడగానే తమిళ వాసనలు గుప్పుమన్నాయి.

# శ్రీలీలకు మళ్ళీ చుక్కెదురు

అవకాశాలకు లోటు లేదు కానీ మోస్ట్ డిమాండింగ్ హీరోయిన్ శ్రీలీలకు బ్లాక్ బస్టర్ మాత్రం అందని ద్రాక్షగా మారిపోయింది. గత నాలుగేళ్లలో ధమాకా, భగవంత్ కేసరి మినహాయించి మిగిలినవన్నీ బాక్సాఫీస్ దగ్గర నష్టాలు తెచ్చినవే. స్కంద, ఆదికేశవ, ఎక్స్ ట్రాడినరి మ్యాన్, రాబిన్ హుడ్ ఒకదాన్ని మించి మరొకటి డిజాస్టర్ కొట్టినవి. గుంటూరు కారం ఏదో మహేష్ ఇమేజ్ వల్ల కమర్షియల్ గా ఓకే అనిపించుకుంది కానీ కంటెంట్ పరంగా అభిమానులు దాన్ని బెస్ట్ మూవీగా పరిగణించరు. శ్రీలీలకు దాని వల్ల కలిగిన ప్రధాన ప్రయోజనం కుర్చీ మడతపెట్టి పాటలో అదిరిపోయే స్టెప్పులతో మాస్ కు దగ్గర కావడం.తాజాగా జూనియర్ కూడా ఈ లిస్టులో చేరిపోయినట్టే. మొదటి మూడు రోజులు కొంచెం హడావిడి చేసినా తర్వాత నెమ్మదించింది. తెలుగు వెర్షన్ కోసం హీరో కిరిటీ చాలా ప్రమోషన్లు చేసుకున్నాడు. రివ్యూలలో కుర్రాడికి మంచి మార్కులు పడ్డాయి. డాన్సుల గురించి సోషల్ మీడియాలో మాట్లాడుకున్నారు. కానీ నటన, కంటెంట్ సెలక్షన్ మాత్రం ఇంకా చాలా ఇంప్రూవ్ కావాలి. కన్నడలో జూనియర్ కొంచెం పర్వాలేదనిపించుకున్నా మొన్న రిలీజైన యువరాజ్ కుమార్ ఎక్కా దెబ్బకి బాగా డౌన్ అయిపోయింది. ఇక 24 నుంచి హరిహర వీరమల్లు వీరంగం ఉంటుంది కాబట్టి జూనియర్ సెలవు తీసుకోవడం తప్ప వేరే ఆప్షన్ లేదు. శ్రీలీలకు పాత్ర పరంగా ప్రాధాన్యం దక్కకపోవడం మరో లోటని చెప్పాలి. ముఖ్యంగా వైరల్ వయ్యారి పాటలో డాన్స్ సంగతి పక్కనపెడితే కిరిటీతో కెమిస్ట్రీ కాస్త ఎక్కువయ్యిందంటూ ట్విట్టర్ లో విసుర్లు కనిపించాయి. ఇప్పుడు శ్రీలీల నుంచి వస్తున్న తర్వాతి సినిమా మాస్ జాతర. రవితేజ హిట్ సెంటిమెంట్ మరోసారి వర్కౌట్ అవుతుందేమో చూడాలి.



# ల్యాగ్ ఉండాల్సిందే
# అంటున్న దృశ్యం దర్శకుడు

ఈ తరం ప్రేక్షకులకు ఓపిక చాలా తక్కువ. సినిమా రయ్యిన దూసుకెళ్లిపోవాలి. ఆరంభం నుంచే కథనం పరుగులు పెట్టాలి. ఏమాత్రం నెమ్మదించినా.. 'ల్యాగ్' అనేస్తారు. సినిమా నిడివి ఎక్కువ ఉన్నా.. 'ల్యాగ్' అనే కంప్లైంట్ వచ్చేస్తుంది. సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయిపోయిన ఈ పదం విషయంలో మలయాళ స్టార్ డైరెక్టర్ జీతు జోసెఫ్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చాడు. సినిమాకు 'ల్యాగ్' అనేది చాలా అవసరమని ఆయన వ్యాఖ్యానించడం విశేషం.మలయాళంలో 'దృశ్యం', 'దృశ్యం-2', 'నేరు'.. ఇలా అనేక బ్లాక్ బస్టర్ సినిమాలు అందించిన దర్శకుడు జీతు. ప్రస్తుతం ఆయన మోహన్ లాల్‌తో 'దృశ్యం-3' చేస్తున్నారు. తన సినిమాలు అని కాకుండా మొత్తంగా మలయాళ సినిమల్లో ల్యాగ్ గురించి కంప్లైంట్ చేసే వాళ్లకు ఆయన ఒక ఇంటర్వ్యూలో సమాధానం ఇచ్చాడు. ఏ కథా ఆరంభం నుంచే పరుగులు పెట్టదని.. ముందు కథకు ఒక పునాది పడడం.. క్యారెక్టర్లు ఎస్టాబ్లిష్ కావడం ఎంతో అవసరమైన విషయాలు అని జీతు అభిప్రాయపడ్డాడు. ప్రేక్షకులను ఒక మూడ్‌లోకి తీసుకెళ్లాలంటే కొంత సమయం పడుతుందని.. అలాంటపుడు ల్యాగ్ అనే ఫీలింగ్ తప్పకుండా వస్తుందని.. సినిమాకు ఈ 'ల్యాగ్' చాలా అవసరమని జీతు అన్నాడు.

తన కొత్త సినిమా 'దృశ్యం-3'లో కూడా ఈ ల్యాగ్ ఉంటుందని.. దీనికి ప్రిపేరై ఉండాలని జీతు చెప్పడం విశేషం. దృశ్యం, దృశ్యం-2 సినిమాల్లో కూడా ప్రథమార్ధంలో ఒక దశ వరకు కథ నెమ్మదిగా సాగుతున్నట్లు అనిపిస్తుంది. కానీ తర్వాత కథలోని మలుపులు బయటికి వచ్చాక కథనం పరుగులు పెడుతుంది. ముందు మామూలుగా తోచిన సన్నివేశాలు కూడా తర్వాత భలేగా అనిపిస్తాయి. అదంతా జీతు స్క్రీన్ ప్లేలోని మ్యాజిక్. ఈ నేపథ్యంలోనే 'ల్యాగ్' అనే మాట ఓవర్ రేటెడ్ అంటూ తనదైన శైలిలో విశ్లేషించాడు జీతు.





## ఇద్దరు స్టార్ల 25ఏళ్ల
# ప్రస్థానాన్ని సెలబ్రేట్ చేస్తూ..

'వార్ 2' మూవీకి సంబంధించి 25వ నెం బర్‌కి ఓ ప్రత్యేకత ఉంది. భారతీయ సినీ ఇండస్ట్రీలో ఇద్దరు గొప్ప స్టార్స్ అయిన హృ తిక్ రోషన్, ఎన్టీఆర్‌లను ఒకే సినిమాలో నటింపజేసే అపూర్వ అవకాశాన్ని నిర్మాత ఆదిత్య చోప్రా సాధించారు. యశ్ రాజ్ ఫిలిమ్స్ రూపొందిస్తో న్న ప్రతిష్టాత్మక స్పై యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కుతున్న 'వార్ 2'ను అయాన్ ముఖర్జీ దర్శక త్వం వహిస్తున్నారు. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఇద్దరూ ఈ సంవత్సరం తమ సినీ ప్రయాణంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నారన్నది ఒక అద్భుతమైన విషయం. ఇది యాదృచ్ఛికంగా జరిగినప్పటికీ ఈ ప్రత్యేక సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకోవటానికి యశ్ రాజ్ ఫిలిమ్స్ ఈ ఏడాది అత్యంత ప్రతిష్టాత్మకమైన సినిమా ఈ సినిమా ట్రైలర్‌ను జూలై 25న విడుదల చేస్తోంది. ఇండియన్ సినీ ఇండస్ట్రీకి హృతిక్ రోషన్, ఎన్టీఆర్ చేసి న గొప్ప సేవలను అభినందిస్తూ యశ్ రాజ్ ఫిలి మ్స్ వార్ 2 మూవీ ట్రైలర్ లాంచ్ ప్రకటన విడుదల చేసింది. 2025లో ఇం డియన్ సినీ ఇండస్ట్రీ కి చెందిన ఇద్దరు గొప్ప స్టార్స్, తమ సినీ ప్రయాణంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నారు. ఇదొక లైఫ్ టైమ్ మూమెంట్స్. ఈ అరుదైన క్షణాలను గొప్పగా సెలబ్రేట్ చేసుకోవడానికి జూ లై 25న వార్2 ట్రైలర్ విడుదల చేస్తున్నట్లు యశ్‌రాజ్ ఫిలిమ్స్ తెలియజేస్తోంది. ఇద్దరు స్టార్స్ మ ధ్య జరిగే అద్భుత పోరాటం! జూలై 2ని మీ క్యాలెండర్‌లో ప్రత్యేకంగా మార్క్ చేసుకోండి" అని సంస్థ పేర్కొంది. వార్ 2 సినిమా హిందీ, తెలుగు, తమిళం భాషల్లో ఆగస్ట్ 14న ప్రపంచ వ్యాప్తంగా బారీగా విడుదలవుతుంది. ఇందులో కియారా అద్వానీ కథానాయికగా నటిస్తోంది.





# విడాకుల బాటలో హన్సిక?

ఫిలిం సెలబ్రెటీల విడాకులు ఈ మధ్య మామూలు వార్తలైపోయాయి. పెళ్లయిన కొన్నేళ్లకే సెలబ్రెటీ జంటలు విడిపోతున్న విషయం తెలిసి ఫ్యాన్స్ ఫీలవుతున్నారు కానీ.. తర్వాత ఇది మామూలే కదా అని సర్దుకుపోతున్నారు. గత కొన్నేళ్లలో వివిధ ఇండస్ట్రీలకు చెందిన పదుల సంఖ్యలో జంటలు విడిపోయాయి. ఇప్పుడు ఒకప్పటి స్టార్ హీరోయిన్ హన్సిక విడాకుల గురించి వార్తలు మొదలయ్యాయి. ఆమె సోహైల్ కటూరియా అనే తన స్నేహితుడిని పెళ్లి చేసుకుని మూడేళ్లు కూడా కాలేదు.

చాలా గ్రాండ్‌గా పెళ్లి చేసుకోవడమే కాదు.. ఆ తతంగాన్నంతా డాక్యుమెంటరీగా చిత్రీకరించి ఒక ఓటీటీ సంస్థకు ఇచ్చింది ఈ జంట. ఐతే రెండేళ్లకే వీళ్లిద్దరి మధ్య విభేదాలు వచ్చాయని.. కొన్ని నెలలుగా హన్సిక భర్తకు దూరంగా.. తల్లితో కలిసి విడిగా ఉంటోందని మీడియాలో ప్రచారం జరుగుతోంది. సోహైల్‌ది ఉమ్మడి కుటుంబం అని.. అక్కడ హన్సిక ఇమడలేకపోయిందని.. అందుకే భర్తకు దూరంగా తల్లితో కలిసి ఉంటోందని వార్తలు వస్తున్నాయి. హన్సిక, సోహైల్ విడాకులు కూడా తీసుకోబోతున్నారని రూమర్లు వినిపిస్తున్నాయి. ఐతే మీడియా వాళ్లు ఈ విషయమై హన్సికను వివరణ కోరే ప్రయత్నం చేయగా.. ఆమె అందుబాటులోకి రాలేదు. కానీ సోహైల్ మాత్రం ఈ ప్రచారాన్ని ఖండించాడు. తమ మధ్య అంతా బాగుందని తెలిపాడు. కానీ హన్సిక ఈ విషయాన్ని ధ్రువీకరించకపోవడంతో విడాకుల వార్తలు నిజమే అనుకుంటున్నారు జనం. హన్సిక పెళ్లి విషయంలో ఒక ట్విస్ట్ ఉంది. ఆమె పెళ్లాడింది తన ఫ్రెండ్ భర్తను కావడం గమనార్హం. సోహైల్ మొదటి భార్య.. హన్సికకు క్లోజ్ ఫ్రెండ్. సోహైల్ ఏమో హన్సిక సోదరుడికి స్నేహితుడు. మరి తన తొలి వివాహంలో ఏం సమస్యలు వచ్చాయో ఏమో.. భార్య నుంచి విడిపోయి హన్సికతో ప్రేమలో పడ్డాడు.

ఇద్దరూ అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకున్నారు. కానీ మూడేళ్లు తిరక్కుండానే వీళ్లిద్దరూ విడాకులు తీసుకుంటున్నట్లు ప్రచారం మొదలైంది. మరి ఇందులో ఎంత వరకు నిజముందో తెలియాలి.

## లోక కళ్యాణార్థం మాసశివరాత్రి రుద్రాభిషేకం





**ఆమనగల్(ప్రశ్న న్యూస్)** తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామ సరిహద్దులో ఉన్న జ్యోతిర్వణంలో మాసశివరాత్రి రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి వైదిక బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం నాడు (జులై 23) మాసశివరాత్రి సందర్భంగా మేడిపూర్లో మహాసహస్ర లింగేశ్వర స్వామి నిర్వహించే అతిరుద్రంలో భాగంగా ఏకాదశ రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమంలో పాల్గోన్న వేధ పండితులు తెలిపారు. లోకకళ్యాణార్థం మాసశివరాత్రి రోజున నిర్వహించిన ఏకాదశ రుధ్రాభిషేకంతో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి బ్రాహ్మణులు, వేధ పండితులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు.

## శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి

## శాస్త్రోక్తంగా ఘనంగా రుద్రాభిషేకం



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** మాస శివరాత్రి సందర్భంగా శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి.బుధవారం ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతల ఆరాధన వంటి పూజా కార్యక్రమాలు అర్చకులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేయడంతో, ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడిన దృశ్యం కనిపించింది. శివనామస్మరణతో మారుమోగిన ఆలయం, ఆధ్యాత్మికతతో నిండి భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ ఈఓ రాధా బాయి,తదితరులు పాల్గొన్నారు.

## రైతు కమీషన్ తో మార్కెట్ చైర్మన్ భేటీ



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ ని సందర్శించిన రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి.బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు కోదండ రెడ్డికి మార్కెట్లో నెలకొన్న మౌళిక సమస్యల పై చర్చించారు.స్థానికంగా నెలకొన్న పలు మౌళిక సదుపాయాల్లో ఒకటైన మంచి నీటి సరఫరా విషయంలో కమీషన్ తో చర్చించినట్లు సమాచారం.అలాగే మార్కెట్ కి దిక్సూచి లాంటి వారు మార్కెట్ చైర్మన్ పదవి చాలా ఓపికగా వ్యవహరిస్తూ, రైతులు,కమీషన్ ఏజెంట్ల పట్ల సుతిమెత్తగా ఉండాలని ఆయన అనుభవాలను చైర్మన్ రాగిరి ఆనంద్ బాబుకు పంచారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాముల్ నాయక్, రైతు కమీషన్ సభ్యులు భవానీ, బోయిన్ పల్లి మార్కెట్ గ్రేడ్ టూ సత్యనారాయణ, గ్రేడ్ త్రీ మహ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థ ఎన్నికల్లో యువజన నేతలకు 20 శాతం సీట్లు కేటాయించాలి

**- తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు : శివచరణ్ రెడ్డి**

**- పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ: బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు వినతి**



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను బుధవారం తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన నాయకులకు 20 శాతం సీట్లను కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేసిన అర్హత గల యువజన నాయకులకు తప్పకుండా గౌరవించదగిన స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవసరాన్ని ఆయన పునరుద్ఘాటించారు.ఈ భేటీ ద్వారా యువజన నేతలకు రాజకీయంగా మరింత స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ గంభీరంగా ఆలోచిస్తున్నదని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టులో

# మరో ముందడుగు

**- కుడి,ఎడమ కాల్వల భూ సేకరణకు రో.10 కోట్లు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం**

**- కుడి కాలువ ఎడమ కాలువ నిర్మాణానికి మార్గం సుగుమం**

**- ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం నేడు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో 10 కొట్ల నిధులు విడుదల**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు లో మరో ముందడుగు పడింది.కలికోట సూరమ్మ చెరువు కూడి ఎడమ కాలువ నిర్మాణం భూ సేకరణ కోసం ప్రభుత్వం 10 కాలువల కోట్ల నిదులను మంజూరు జిల్లా కలెక్టర్ ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం జరిగింది.గతంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు నిర్మాణం చేయవలసిందిగా అనేక ఆందోళనలు చేసిన విషయం విధితమే. నేడు ఎమ్మెల్యేగా గెలిచాక సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనుల శరవేగంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నారు.గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి చీఫ్ హెూదాలో ప్రాజెక్టు సందర్శించి అధికారంలోకి రాగానే ప్రాజెక్టును పూర్తి చేస్తానని తెలిపారు.. ప్రస్తుతము నీటిపారుదల శాఖ మంత్రి గతంలో రుద్రంగి పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు...ఇచ్చిన మాటకు అనుగుణంగా నేడు భూసేకరణకు రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగింది. రూ. 10 కోట్లతో కుడి ఎడమ కాలువ నిర్మాణానికి భూసేకరణ చేయడం వల్ల ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా కొనసాగడంతో పాటు కుడి ఎడమ కాలువల నిర్మాణం త్వరలోనే పూర్తవుతుందని రైతులు ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యుత్ షాక్ తో మేక మృతి



**మంథని( ప్రశ్న న్యూస్)** విద్యుత్ షాక్ తో మేక మృతి చెందిన సంఘటన బుధవారం మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఖానాపూర్ గ్రామానికి చెందిన పర్ష బాపు కు సంబంధించిన మేకలను నర్ర లస్మయ్య మేపుతున్నాడు. గ్రామంలోని నెతేట్ల మల్లయ్య కు సంబంధించిన పొలం వద్ద కరెంట్ తీగ ప్రమాదవశాత్తు మేక పైన పడటంతో మేక అక్కడికక్కడే మృతి చెందింది. మేకల కాపరి లస్మయ్య తృటిలో ప్రమాదం భారి నుండి తప్పించుకున్నాడు. సుమారు 17వేల విలువ గల మేక మృతి చెందడంతో బాధితుడు పర్ష బాపు రోదిస్తున్నాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని బాధితుడు బాపు కోరారు. కరెంట్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని గతంలో పొలం యజమాని మల్లయ్య చెప్పినప్పటికీ విద్యుత్ శాఖ వారు పట్టించుకోలేదని, విద్యుత్ శాఖ వారు స్పందించి ఉంటే ప్రమాదం తప్పి ఉండేదని మల్లయ్య, గ్రామస్తులు పేర్కొన్నారు.

## వ్యవసాయ మరియు రెవెన్యూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్త తనిఖీలు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాల మేరకు ఈరోజు కూల్చారం పరిధిలోగల కోళ్ల దాన పరిశ్రమను ప్రత్యేక తనికి నిర్వహించడం జరిగింది ముఖ్యంగా ప్రభుత్వంకు వ్యవసాయానికి వాడాల్సినటువంటి యూరియాను ఇతర పరిశ్రమ అవసరాలకు వాడుతున్నారన్న ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రెవిన్యూ మరియు పోలీసు వ్యవసాయ శాఖ అధికారులకు తనిఖీలు నిర్వహించాల్సిందిగా ఆదేశించిన నేపథ్యంలో ఈరోజు కూల్చారం మండలోని పోతాంశెట్టిపల్లి ఎం/స శ్రీ లక్ష్మి పౌల్ట్రీ ఫార్మ్ పరిధిలోగల కోళ్ల దాన పరిశ్రమను సందర్శించడం జరిగింది ఈ సంఘటన లో ఎలాంటి వ్యవసాయ సంబంధ యూరియా వాడటం లేదని తనిఖీల్లో గుర్తించడం జరిగింది అదేవిధంగా దానా తయారీలో మరియు వాడుతున్న పదార్థాల వివరాలన్నిటిని సంచులపై ముద్రించాలని ఈ దానాలో వాడే పదార్థాలను తప్పనిసరిగా సమాచార పత్రాన్ని వాడుతున్నటువంటి కస్టమర్లకు అందించాలని ఈ సందర్భంగా ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్ చారి,ఏ ఓ శ్వేత కుమారి మరియు ఎస్సై ఎండీ. గౌస్ ఆర్ ఐ ప్రభాకర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ అవసరాల నిమిత్తం మాత్రమే యూరియాను వాడుకోవాలని ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ గాని పరిశ్రమల అవసరాలకు వాడినట్టయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించడం జరిగింది అలాగే ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది.

## ఇందిరా మహిళా శక్తి పథకం

## మహిళల ఆత్మవిశ్వాసానికి ఒక ప్రేరణ

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్**

**- ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** ఇందిరా మహిళా శక్తి పథకం మహిళల ఆత్మవిశ్వాసానికి ఒక ప్రేరణ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.బుధవారం వేములవాడ పట్టణంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ధనలక్ష్మి మండల సమైక్య సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల,విత్తనాల దుకాణానాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నారని తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అన్నారు.

## మెదక్ జిల్లా కేంద్రంలో

## ఆర్డీవో రమాదేవి ఆకస్మిక తనిఖీలు

**- గ్రోమోర్ ఫర్టిలైజర్ షాప్ ను సందర్శించిన ఆర్డీవో.**

**- మెదక్ ఆర్డీవో రమాదేవి**



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** జిల్లా లో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని అనవసరంగా కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని మెదక్ ఆర్డిఓ రమాదేవి తెలిపారుబుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో ఫర్టిలైజర్ షాపును ఆకస్మికంగా ఆర్డీవో రమాదేవి సందర్శించారుషాప్ ముందు పెట్టిన యూరియా నిల్వల బోర్డు ను ఆర్డీవో రమాదేవి ముందుగా పరిశీలించి... ఆ తర్వాత... ఇప్పటివరకు ఎంత మంది రైతులకు యూరియా అమ్మారు? ఏ విధంగా అమ్మకాల ప్రక్రియ జరుగుతుంది, వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారు అని షాప్ యాజమాన్యం ని అడిగి తెలుసుకున్నారుఅనంతరం గోదాం లో ఉన్న స్థాక్ ని ఆర్డిఓ పరిశీలించారు ఈ సందర్భంగా ఆర్డీవో రమాదేవి మాట్లాడుతూ... జిల్లా లో ఎలాంటి యూరియా కొరత లేదని.... అనవసరం గా కొరత సృష్టి స్తే ఉపేక్షించేది లేదన్నారు పక్కాగా అమ్మకాలు జరగాలని.. ఏ రైతుకు ఎంత అమ్ముతున్నారో... వారి ఫోన్ నెంబర్ తో సహా అన్ని వివరాలను నమోదు చేయాలనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇతర పోలీసు అధికారులు, అగ్రికల్చర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ?

## మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎనలేని కృషి

**- కలెక్టర్ రాహుల్ రాజ్ - మెదక్ ఆర్టీసీ బస్ స్టేషన్ లో సంబురాలు**




**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషిని కొనసాగిస్తోందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సదుపాయాన్ని 200 కోట్ల మంది వినియోగించుకున్న సందర్భంగా బుధవారం మెదక్ ఆర్టీసీ. ప్రాంగణంలో ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ రాహుల్ రాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 09 డిసెంబర్ 2023 నుండి మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తెస్తూ, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ వసతిని కల్పించిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో గడిచిన సుమారు 20 నెలల కాలంలోనే 200 కోట్ల సార్లు మహిళలు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారని వివరించారు. తద్వారా ప్రయాణ ఛార్జీల రూపంలో రూ. 6680 కోట్లు మహిళలకు ఆదా అయ్యాయని అన్నారు. ఈ మొత్తాన్ని ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. మెదక్ జిల్లాలో 2.72 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేయడం వల్ల రూ. 81.04 కోట్లు ఆదా చేసుకున్నారని తెలిపారు. ఉచిత ప్రయాణ వసతి వల్ల మహిళలు తమ అవసరాల నిమిత్తం విరివిగా ప్రయాణ సదుపాయాన్ని వినియోగిస్తున్నారని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు ప్రయాణ వసతి పొందుతున్నారని, భవిష్యత్తులో పురుషులను అధిగమించే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరగడంతో మన జిల్లా పరిధిలో కొత్తగా 08 బస్సులను కొనుగోలు చేశారని కలెక్టర్ తెలిపారు. ఉచిత ప్రయాణ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆర్టీసీ సంస్థ ద్వారాఅన్ని రోజులు ప్రజలకు విశేష సేవలు అందిస్తూ మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు, సిబంధికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్టీసీ సంస్థ ద్వారా ఆయా పాఠశాలల విద్యార్థినులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన బాలికలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పలువురు మహిళా ప్రయాణికులను, ఆర్టీసీ సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డి. యం సురేఖ, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్స్ వీరబాబు , సుగుణాకర్ విద్యార్థినీ విద్యార్థులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛలో హైదరాబాద్

**- చలో గన్ పార్క్ కార్యక్రమం**

**- ఉద్యమ కళాకారులకు గుర్తింపు కార్డులు, ఇండ్లు, ప్లాట్లు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్**



**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** ఉద్యమ కళాకారుల సంక్షేమాన్ని కోరుతూ జూలై 22 మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్ గన్ పార్క్ వద్ద "చలో గన్ పార్క్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చీమ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు పాల్గొని ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... "ఉద్యమ కళాకారులు ప్రభుత్వంపై భారం కాకుండా తమ స్వయంకృషితో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. అలాంటి వారిని ప్రభుత్వం గౌరవించి తగిన గుర్తింపు కల్పించాలి. శాసనసభ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి" అని స్పష్టం చేశారు.కళాకారులకు గుర్తింపు కార్డులు, నివాస స్థలాలు (ఇండ్లు, ప్లాట్లు), హెల్త్ కార్డులు త్వరితగతిన ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు వారాల దేవయ్య,సంస్థ ఉపాధ్యక్షులు ఆడెపు ద్వితీయ చందు,బోయినిపల్లి మండల అధ్యక్షుడు మొగిలోజి లక్ష్మీరాజం,జిల్లా కోశాధికారి చిలుముల రమేష్, మండల కార్యదర్శి బిల్ల వెంకట్, నరసయ్య సావనపల్లి లచ్చయ్య,సతీష్ ఆరెంజ్, వేములవాడ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి కూపంలో అంగన్వాడీ కేంద్రాలు : అంగట్లోకి సరుకులు

- అంగన్వాడీలలో అక్రమాల సంగతేంటి - అంగట్లో అంగన్వాడీ సరకులు
- బజారుకు చేరుతున్న గుడ్లు, పాలు, పప్పు నూనే - కార్యరూపం దాల్చని సి.సి కెమెరాల ఏర్పాటు
- సరైన లబ్దిదారులకు అందని పౌష్టికాహరం - అక్రమార్జనకు రుచి మరిగిన అంగనవాఢీ సిబ్బంది
- పిల్లలు, గర్బిణిలు, బాలింతలు కేద్రాలకు రాకున్నను వచ్చినట్లు హాజరు నమోదు
- స్టాక్ రిజిస్టర్, హాజరు పట్టికతో పకడ్బందిగా సమీక్షించాలి
- అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిగా అవినీతి కూపంలో మునిగిపోయాయి. ఈ కేంద్రాలలో పనిచేసే టీచర్లు, సహాయక సిబ్బంది చేతివాటంతో చిన్నపిలల్లు, గర్భిని స్త్రీలకు అందాల్సిన పౌష్టికాహారానికి సంబందించిన వస్తువులు చీకటి బజారుకు తరలివెళ్తున్నాయని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు. పౌష్టికాహార లోపంతో బాధ పడుచున్న గర్బిణిలకు, చిన్న పిల్లలపై దృష్టి సారించిన ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తుండగా వాటి పనితీరు మాత్రం అవినీతి మయమై దుర్భరంగా మారింది. ఇక్కడ పనిచేసే టీచర్లు, సిబ్బంది చేతివాటంతో పిల్లలు, మహిళలకు అందాల్సిన గుడ్లు, పాలు, పప్పు, తదితర సామగ్రి బహిరంగ మార్కెట్‌లో దర్శనమిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అయితే అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిఉంది. ఈ దిశగా ఆలోచించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సమాచారం. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నామ మాత్రంగా నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రాలకు వచ్చిన సరుకులు, విద్యార్థుల హాజరుతో పోల్చడమే కాక సహా అంగన్‌వాడీ కేంద్రాలను జరుగుచున్న కార్యకలాపాలను పూర్తి స్థాయిలో పరిశీలించేలా ప్రభుత్వం కఠిన చర్యలు అమలుచేయాలని ప్రజలు కోరుచున్నారు. గతం అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం నేటికి కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం మరోవైపు బయోమెట్రిక్ విధానం అమలు కూడా సాధ్యపడకపోవడంతో సరైన పర్యవేక్షణ లేక అక్రమాలు అధికమైన్నాయని సమాచారం. ఇక జిల్లాలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి అవి సొంత భవనా లు ఉన్నాయే లేక అద్దె భవనాల్లో ఎన్ని ఉన్నాయనే సమాచారంతో పాటు ఈ కేంద్రాలలో ఎంత మంది టీచర్లు, సిబ్బంది ఉన్నారని, పిల్లలు, గర్భిణు లు, బాలింతలు సంఖ్య ఎంత అనే పక్కా సమాచారం జిల్లా అధికారుల నుంచి సేకరించి లెక్కలకు అనుగుణంగా వసతులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది

### సి.సి కెమెరాలు ఏర్పాటయ్యేనా

అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేదుకు ప్రభుత్వం ఫొటో క్యాప్చర్ అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు రాకపోయిన వచ్చినట్లు హాజరు వేస్తు అక్కడి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు పౌష్టికా హారం ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోజువారి ఆహారం కూడా వడ్డించడం లేదనే ప్రచారం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంత మంది పిల్లలు వస్తున్నారు వారికి ఏమి నేర్పుతున్నారు బాలింతలు, గర్భిణులు వస్తున్నారా లేదా వచ్చేవారికి మెనూ ప్రకారం ఆహారం ఇస్తున్నారా లేదా. అనే విష యాలపై ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు యాప్‌ల ద్వారా టీచర్లు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి అదనంగా ఫొటో క్యాప్చర్ విధానానికి శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రంలో హాజరయ్యే పిల్లలను ఒక్కొక్కరిగా ఫొటోలు తీసి యాప్‌లలో పొందు పర్చాల్సి ఉంటుంది. అలాగే గర్భిణులు, బాలింతలు భోజనం చేసే సమయంలోను ఇదే విధానం అమలు చేయాలి. తద్వారా ఎంత మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు హాజరవుతున్నారనే పక్కా సమాచారం ప్రభుత్వాలకు పక్కాగా చేరుతుంది. అయితే ఫొటో క్యాప్చర్ విధానం పిల్లల వరకు అయితే అమలు చేయవచ్చుగానీ, గర్భిణులు, బాలింతలకు సాధ్యపడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి రోజూ కేంద్రాలకు వచ్చి ఫొటో క్యాప్చర్ ఇచ్చేంత వెసులుబాటు వారికి ఉంటుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఒక్కొక్కరి ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయడం కూడా అదనపు పనిభారమే అవుతుందనే అభిప్రాయాలను పలువురు టీచర్లు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బరువులు, ఎత్తులు తూచడం, వంట చేయించడం, వంటి పనులతో సమయం సరిపోవడం లేదని, కొత్తగా ఫొటో క్యాప్చర్ అమలు చేయడం ఎలా అన్న సందేహాలు వ్యక్త మవుతున్నాయి. కాగా ప్రభుత్వ నిర్ణయం పకడ్బంధీగా అమలు అయితే అంగన్‌వాడీల్లో అక్రమాలకు చెక్ పడినట్లేనన్న అభిప్రాయాలు సైతం వినిపిస్తున్నాయి.

### పిల్లల కడుపుకొడుతున్న ఆ అంగన్‌వాడీల సిబ్బంది

పిల్లలలో పోషణ శక్తిని పెంపొందించడానికి ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, వాటి అమలులో చిత్త శుద్ది లేక పిల్లలకు సరియైన పోషకాలు అందకపోవడం గమనార్హంపిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నెలకు పదహారు గుడ్లు, పాలు, బాలమృతం వంటి సరుకులు పంపిణీ చేస్తుండగా అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుచున్న అవకతవకల వల్ల అవి సక్రమంగా పిల్లలకు అందడం లేదు. కొన్ని అంగన్‌వాడీల్లో ఏకంగా రెండు నెలలకు ఒకసారి గుడ్లు ఇచ్చే పరిస్థితి తయారు అయ్యింది. దీనిపై అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు వస్తున్నయని పిల్లల తల్లితండ్రులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

### పట్టించుకోని అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పసి పిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందించి వారిని దృడంగా తయారు చేయాల్సిన సిబ్బందే అక్రమార్జనకు రుచి మరిగి సరుకులను మాయం చేస్తున్నారు. కొందరు అంగన్‌వాడీ టీచర్‌లు పిల్లలకు ఇచ్చే సరుకులను పక్కదారి పట్టించి, పసి పిల్లల కడుపు కొడుతు తమ కడుపు నింపుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకుల అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోతోందని బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేపట్టి పిల్లలకు పంపిణీ చేయాల్సిన సరుకులు సక్రమంగా అందేల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# “రైతు కమీషన్”రాకతో ఉలిక్కిపడ్డ మార్కెట్

- బోయిన్ పల్లి మార్కెట్లో నిన్న ఉదయం 7:12 నిమిషాలకు రైతు కమీషన్ ఆకస్మిక తనిఖీలు
- రైతు ఫిర్యాదా.? లేక సాధరణ తనిఖీలా.? అర్థం కాక తలలు పట్టుకున్న మార్కెట్ అధికారులు
- ఆసియాలోనే అతిపెద్ద బోయిన్ పల్లి మార్కెట్నీ సందర్శించిన రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి
- ఏఎంసీలో కమీషన్ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు
- మార్కెట్ కి ఎన్ని రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయని, సగటున ఎన్ని టన్నుల కూరగాయలు వస్తాయని సిబ్బంది నుంచి వివరాలు సేకరించిన కమీషన్
- బోయిన్ పల్లి మార్కెట్లో అతి కీలకమైనది “గేట్ ఎంట్రీ” ఏమైనా అవకతవకలు ఉన్నాయా అంటూ తనిఖీలు
- మార్కెట్ కి సుప్రీం చైర్మన్, రైతులకి,కమీషన్ ఏజెంట్లకు వారధిగా ఉండిలని మార్కెట్ చైర్మన్ కి హితవు:కోదండ



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్‌లో నిన్న బుధవారం ఉదయం 7:12 నిమిషాలకు రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2న ఏర్పాటు అయినప్పటి నుంచి గత రెండేళ్ల క్రితం దాకా రైతు కమీషన్ గా గుత్తా సుఖేందర్ రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత,ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి రైతు కమీషన్ గా బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే! కానీ అసలు విషయం ఎవ్వరికీ అర్థం కాని విషయం ఏమిటంటే జంటనగరాల్లో ఉన్న మార్కెట్లల్లో అతి కీలకమైనది డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్.నిన్న ఉదయం రైతుకమీషన్ బోయిన్ పల్లి మార్కెట్నీ సందర్శించడం పట్ల పలు అనుమానాలకు దారితీస్తోంది.రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి,చెవేళ్ల,దపరిగి,మెదక్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు ఏమైనా “రైతు కమీషన్”కి ఫిర్యాదు చేశారా అనే కోణంలో అధికారులు, కమిటీకి అర్థం కాలేదు. ఎన్నడులేని విధంగా మొట్టమొదటి సారి బోయిన్ పల్లి మార్కెట్ చరిత్రలో “రైతు కమీషన్”రావడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. “రైతు కమీషన్ చైర్మన్: బోయిన్ పల్లి మార్కెట్ లో రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డితో పాటు రాములు నాయక్ ఎమ్మెల్సీ,భవానీ పాలక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.మార్కెట్లో తిరిగి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.దాదాపు గంటన్నర పాటు మార్కెట్లో పర్యటించిన తర్వాత సిబ్బంది పని తీరును ప్రశ్నిస్తూ, వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు.అలాగే ఇంత పెద్ద మార్కెట్లో “ట్రాఫిక్ జామ్”అయితే అధికారుల జాడేది అని నిలదీశారు కమీషన్ ? అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన రైతు కమీషన్.అదిగాక మార్కెట్లో రైతులను ఏ జిల్లా నుంచి ఏఏ కూరగాయలు మార్కెట్ కి తరలిస్తున్నారు,ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అంటూ అడిగారు.అలాగే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే కూరగాయల వివరాలు, కమీషన్ ఏజెంట్లతో కూడా పలు అంశాలపై చర్చించారు రైతు కమీషన్ కోదండ రెడ్డి, ఎమ్మెల్సీ రాములు నాయక్, సభ్యులు భవానీ.బోయిన్ పల్లి మార్కెట్లో నిత్యం చోటు చేసుకునే అంశాలు:రైతుల పంట ద్వారా వచ్చే కమీషన్ న్యాయ బద్దంగా దుకాణపు దారుల నుంచి చేరుతుందా లేదా అనే కోణంలో కూడా రైతు కమీషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆరా తీశారు.మరో విషయం ఏమిటంటే మార్కెట్ గ్రేడ్ టూ సత్యనారాయణ అధికారి చాంబర్లో కూర్చున్న రైతు కమీషన్ కోదండ రెడ్డి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా గ్రేడ్ టూ,త్రీ నీ అడుగుతూ చాంబర్లో రసీదులు, అటెండెన్స్,రిజిష్టర్,రికార్డులు పరిశీలించిన రైతు కమీషన్.అలాగే “గెట్ ఎంట్రీ”లో వివిధ రాష్ట్రాలకు చెందిన భారీ వాహనాల్లో దిగుమతి అయిన కూరగాయల వివరాలు డేటా ను సేకరించిన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉన్నత శ్రేణి వివరణ: డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ ని “రైతు కమీషన్”రాక పై ఎటువంటి సమాచారం లేదని,వాస్తవానికి బోయిన్ పల్లి మార్కెట్లో ఎలాంటి అవకతవకలు జరిగే అవకాశం లేదన్నారు బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ఎం వేంకన్న.ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ గా గుర్తింపు పొందిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్.సుమారు దేశంలో ఉన్న పదిహేడు రాష్ట్రాల నుంచి వివిధ రకాల కూరగాయలు దిగుమతి అవుతున్నాయని,మార్కెట్ కి వార్షిక ఆదాయం సుమారు 12 కోట్లు పై చిలుకు ఉంటుందని,దేశంలోనే మొట్టమొదటి సారి బయో గ్యాస్ కేంద్రాన్ని బోయిన్ పల్లి మార్కెట్ లో ఏర్పాటు చేయడం,దాన్ని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోని మహారాష్ట్ర,కర్ణాటక రాష్ట్రాల్లో త్వరలో ఆచరణలోకి రాబోతుందని ఉన్నత శ్రేణి గ్రేడ్ వన్ అధికారి ఎం వేంకన్న పేర్కొన్నారు.మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ కి సగటున రోజుకు ఇరవై ఐదు వేల టన్నుల కూరగాయలు దిగుమతి అవుతున్నాయని అంటే వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు!అలాగే గడిచిన నాలుగు రోజుల క్రితం బోయిన్ పల్లి పరిసర ప్రాంతాల్లో “బోనాల పండుగ ఉత్సవాలు ఉండడం,రేపు అమావాస్య రావడం వల్ల మార్కెట్లో”డబుల్ మార్కెట్ “కారణాంగా వ్యాపారం భారీగా జరిగింది.అందుకనే ఉదయం ట్రాఫిక్ జామ్ పెద్ద ఎత్తున చోటు చేసుకోవడం ఓ కారణం.“రైతు కమీషన్”మార్కెట్ నిసందర్శించడం చాలా శుభపరిణామం,అలాగే కమీషన్ ఏమైనా సూచనలు చేస్తే వాటిని పరిగణనలోకి తీసుకుని ఆచరిస్తామన్నారు.



## బీజేపీలో కుల రాజకీయాలకు తావులేదు

- మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీజేపీలో కుల రాజకీయాలకు తావులేదని నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నాయకుడు ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా ఆసక్తికరంగా స్పందించారు. బీజేపీలో కుల రాజకీయాలకు స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. బీసీ నాయకుడు శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్‌లో ఇరవై సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగారని గుర్తు చేశారు. ఆయన తర్వాత కూడా అక్కడ బీసీ నాయకుడినే ముఖ్యమంత్రిగా నియమించారని తెలిపారు. బీజేపీ పాలిత అనేక రాష్ట్రాల్లో బీసీ నేతలే ముఖ్యమంత్రులుగా ఉన్నారని ఆయన వెల్లడించారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి రావడం పెద్ద కష్టమేమీ కాదని ఆయన అన్నారు. ఆరు నెలల్లోనే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయని జోస్యం చెప్పారు. మీరు ముఖ్యమంత్రి అవుతారా అని విలేకరులు అడగగా, తనను అభిమానించే వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటి నిర్మాణదారుడుపై
# యూట్యూబర్స్ దాబాయింపు

- ఇంటి నిర్మాణ పనులు ఆపేస్తాం అని హెచ్చరిక



ఎల్బీనగర్ (ప్రశ్న న్యూస్) నాగోల్ డివిజన్‌లో ఈ మధ్యకాలంలో ఇంటి నిర్మాణదారులపై యూట్యూబర్స్ బ్యాచ్ దబాయింపులు ఎక్కువయ్యాయి. మేము రిపోర్టర్లము మాకు కొంత డబ్బులు (రుసుము) చెల్లించాలని,లేకుంటే మీ ఇంటి పనిని నిలిపివేస్తాం అని దబాయిస్తూ,ఇంటి ఓనర్ ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.ఏకంగా పలుమార్లు ఫోన్ చేసి వేధిస్తున్నారు,ఆ వేధింపులు తట్టుకోలేక ఇంటి నిర్మాణదారుడు ఇదేం గోల మొర్రో అంటూ స్థానిక విలేఖరికి కాల్ చేసి గోడు వెళ్లబోసుకున్నారు. వీళ్ళ ఆగడాలు ఇక్కడే కాకుండా లింగోజిగూడ డివిజన్ లో కూడా ఓ నిర్మాణదారుడుపై ఒత్తిడి పెంచి డబ్బులు ఇవ్వాలంటూ నిర్మాణదారున్ని అనారోగ్యానికి గురి చేశారు.

## మాలక్ష్మి పథకం ద్వారా మహిళలు
# రూ.6,680 కోట్లు ఆదా చేసుకున్నారు

- ఉచిత ప్రయాణాలతో ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేషియో 97 శాతానికి చేరింది
- కాలుష్యాన్ని నివారించేందుకు హైదరాబాదులో బ్యాటరీ బస్సులు వినియోగిస్తున్నాం
- కొద్ది రోజుల్లో నగర మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ చేస్తాం
- రూ.20 వేల కోట్లతో రాష్టంలో కొత్త రోడ్లు నిర్మాణం, మరమ్మతులకు శ్రీకారం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాం, ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి 6,680 కోట్లు ఆదా చేసుకున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 200 కోట్ల మహిళల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో పండుగ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రంలోని మహిళలు పిల్లల చదువుల కోసం, దేవాలయాల సందర్శన, నగరాల్లో ఉద్యోగం వంటి పనుల కోసం ఆర్టీసీ సేవలను మహాలక్ష్మి పథకం ద్వారా ఉపయోగించుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా రాష్ట్రంలోని మహిళలు రూ.200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ.6,680 కోట్ల రూపాయలు ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ లోని మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్)లో బుధవారం మహా లక్ష్మి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ కూడా పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్,ఆర్టీసీ ఎండీ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన,ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... ఆర్టీసీ మునిగిపోయే పడవ అని ఆరోజు అన్నారు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత ఇప్పుడు ఆర్టీసీ లాభాల్లోకి వచ్చి నిలదొక్కుకుందని వివరించారు. 200 కోట్ల ప్రయాణాలకు అయిన ఖర్చు 6,680 కోట్లు ఆడబిడ్డల పక్షాన ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తుందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఆడబిడ్డల ఆర్టీసీ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లిస్తుందని అన్నారు.ఆర్టీసీ లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కొత్త కొత్త విధానాలు తీసుకురావడం మూలంగా ఆదాయం పెరిగి ఇప్పటివరకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2,400 కొత్త బస్సులు కొనుగోలు చేసిందని డిప్యూటీ సీఎం అన్నారు. ఒకప్పుడు ఆర్టీసీ ఆర్యూపెన్సి రేషియో 60 శాతంగా ఉంటే మహాలక్ష్మి పథకం ద్వారా అది 97 శాతానికి పెరిగిందని తెలిపారు. మహాలక్ష్మి పథకానికి ముందు ఆర్టీసీలో 45 లక్షల మంది ప్రయాణం చేస్తే ఇప్పుడు వారి సంఖ్య 65 లక్షలకు చేరుకుందని వివరించారు. హైదరాబాదులో కాలుష్యం పెరుగుతుంది ఈ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు నగరంలో ఉన్న డీజిల్ బస్సులను హైదరాబాద్ నగరం బయటికి దశలవారీగా షిఫ్ట్ చేస్తున్నారు. నగరంలో ఉన్న బస్సుల్లో 11 శాతం బ్యాటరీ బస్సులను జత చేశారు. ఇప్పటికే మూడు వేల బ్యాటరీ బస్సులను ఆర్డర్ ఇచ్చారు మరో 500 బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు అని తెలిపారు. ఈ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీలో ప్రయాణమే కాదు వారికి వడ్డీ లేని రుణాల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి, ఆ బస్సులను ఆర్టీసీకి లీజుకు ఇప్పించి మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఇటీవలే బస్సుల అద్దెలకు సంబంధించిన కోటి రూపాయల నగదును నా ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించారని వివరించారు. ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందిస్తున్నామని అందులో భాగంగా మొదటి సంవత్సరం లక్ష్యానికి మించి 21, 650 వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించామని వివరించారు. ఈనెల 12 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా శక్తి సంబరాల్లో వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. కొద్ది రోజుల్లోనే హైదరాబాదు నగరంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ పండుగను హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైలాసిస్టెంట్ క్షమ శాఖ మంత్రి సీతక్కల ఆధ్వర్యంలో చేస్తామని తెలిపారు.రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో 20వేల కోట్లతో కొత్త రహదారుల నిర్మాణం, ఉన్న రహదారుల మరమ్మతు, విస్తరణ కార్యక్రమాలు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టబోతున్నట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణం ద్వారా ఆర్టీసీలో సురక్షితంగా ప్రయాణం తోపాటు రాష్ట్రవ్యాప్తంగా సుఖమైన రవాణాకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588